





కోలాట ప్రదర్శన

నేడు మహాశివరాత్రి

- వైభవంగా సాగుతున్న బ్రహ్మోత్సవాలు
- అద్భుత ఘట్టం పాగాలంకరణ, కల్యాణోత్సవం
- భక్తులతో కిక్కిరిసిన శ్రీగిరి







శ్రీశైలంలో రోప్‌వే

గజవాహన సేవలో భక్తుల నృత్యాలు, కోలాహలం

గజ వాహనంపై ఆది దేవుడి వైభవం

శ్రీశైలం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఇల కైలాసమైన శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు మంగళవారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ప్రత్యేక అలంకృతులైన స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను సుగంధ పుష్పాలతో ముస్తాబైన గజవాహనంపై కొలువుదీర్చారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజాదికాలు, హారతులు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ ఆలయం నుంచి వెలుపలకి తీసుకొచ్చారు. గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజాదికాలను నిర్వహించి క్షేత్ర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవానికి భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. గ్రామోత్సవం ఎదుట కోలాటం, చెక్కభజన, తప్పెట్లు, డ్రమ్స్, భజంత్రీలు, శంఖునాదాలు మార్మోగాయి. గ్రామోత్సవం గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి బయలు వీరభద్ర స్వామి ఆలయం వరకు ఉత్సవం కొనసాగింది. గజవాహనంపై దర్శనమిచ్చిన భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లను భక్తులు కన్నులారా దర్శించుకుని నీరాజనాలు సమర్పించారు. కాగా ఉత్సవ ఏర్పాట్లను డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జేసీ విష్ణుచరణ్, ఈఓ, శ్రీనివాసరావు, డీఎస్పీ రామాంజినాయక్ పరిశీలించారు.

ప్రధాన ఘట్టం పాగాలంకరణ

బుధవారం లింగోద్భవకాల మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అనంతరం అర్ధరాత్రి వేళ పాగాలంకరణ నిర్వహిస్తారు. అనంతరం స్వామి అమ్మవార్లకు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. మహాశివరాత్రి వేడుకల సందర్భంగా శ్రీశైలంలో పాగాలంకరణకు ప్రత్యేక విశిష్టత ఉంది. శైవ క్షేత్రాల్లో మరెక్కడా జరగని విధంగా శ్రీశైల జ్యోతిర్లింగమూర్తికి మూడు తరాలుగా ఈ అద్భుత వేడుక జరుగుతోంది. శ్రీశైలంలో లింగోద్భవకాలాన జరిగే పాగాలంకరణకు ఎంతో విశిష్టత ఉంది. ప్రకాశం జిల్లా హస్తినాపురానికి చెందిన పృథ్వీ వెంకటేశ్వర్లు కుటుంబం మూడు తరాలుగా శ్రీశైల మల్లన్నకు పాగాను అలంకరిస్తోంది. కల్యాణోత్సవానికి ముందు వరుడు మల్లన్నకు తలపాగా చుట్టే ఈ ఆచార శైలి అద్భుతంగా ఉంటుంది. ఏడాది పాటు దీక్షలో ఉండి రోజుకు ఒక మూర చొప్పున 365 రోజులు పాగా వస్త్రాన్ని పృథ్వీ కుటుంబం నేస్తుంది. మహాశివరాత్రి రోజున చిమ్మ చీకట్లో దిగంబరులుగా మారి స్వామివారి గర్భాలయ విమాన కలశాలు, నవనందులను కలుపుతూ పాగాను అలంకరిస్తారు. ఈ సమయంలో ప్రధాన ఆలయంపైన విద్యుత్ వెలుగులు పడకుండా అలాగే సెల్‌ఫోన్లతో ఫొటోలు తీయనివ్వకుండా దేవస్థాన సిబ్బంది జాగ్రత్తలు తీసుకుంటారు. ఈ కార్యక్రమానికి పరిమిత సంఖ్యలో భక్తులను అనుమతించి ప్రధాన ఆలయం ద్వారాలు మూసివేస్తారు. ఈ సమయంలో ప్రధాన ఆలయం పరిసరాలు, వెలుపల భక్తుల శివనామస్మరణ చేస్తూ గడుపుతారు.



పాతాళగంగలో భక్తుల పుణ్యస్నానాలు





పాదయాత్రగా శ్రీశైలానికి చేరుకుంటున్న భక్తులు

కృష్ణానది యాజమాన్య బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రాయలసీమ ప్రజా సంఘాల సమన్వయ కమిటీ నాయకులు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేయాలని రాయలసీమ ప్రజా సంఘాల సమన్వయ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని కలెక్టరేట్ ముందు వేదిక ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని హైదరాబాదు నుంచీ అమరావతికి తరలించాలన్న నిర్ణయం అర్థరహితమని ప్రకటించారు. హంద్రీ పరిరక్షణ సమితి నాయకుడు కల్లూరు చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఏళ్ల తరబడి ప్రభుత్వాలు రాయలసీమ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. కరువులు, వలసలు, రైతుల ఆత్మహత్యలు నిత్యకృత్యమయ్యాయని, తక్షణమే సీమలోని పెండిగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమ విద్యావంతుల వేదిక కోకన్వీనర్ విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ రానున్న బడ్జెట్‌లో రాయలసీమకు అన్ని రంగాల్లో 42 శాతం నిధులు కేటాయించాలని అన్నారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ రాయలసీమలో ఉన్న రాష్ట్రస్థాయి సంస్థలను కర్నూలులోనే యధావిధిగా కొనసాగించాలని, ఏపీజీబీ కేంద్ర కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని అన్నారు. జేవీవీ బాధ్యుడు శేషాద్రిరెడ్డి, రైతు కూలీ సంఘం నాయకుడు సుంకన్నలు మాట్లాడుతూ విభజన చట్టంలో సీమకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని, ప్రభుత్వ రంగంలో కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని, గుంతకల్లు రైల్వే జోన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాభ్యుదయ సంస్థ నాయకుడు భార్గవ, ఎస్‌డీపీఐ నాయకులు చాంద్, ఆరిఫ్, ఏఐటీయూసీ నాయకుడు మనోహర్ మాణిక్యం, శేషగిరి, సుంకన్న, గద్వాల ఈరన్న, సీపీఐ నాయకులు పాల్గొన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ బి. నవ్యకు వినతిపత్రం అందజేశారు.

సీజనల్ దోపిడీపై లోకాయుక్త సీరియస్



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- ఆంధ్రజ్యోతి బృందం తనిఖీల్లో వెలుగు చూసిన అక్రమాలు
- పేద విద్యార్థుల కడుపు కొడుతున్న సిబ్బంది
- ఇష్టారాజ్యంగా సీజనల్ హాస్టళ్ల నిర్వహణ
- సుమోటోగా ఏపీ లోకాయుక్త కేసు నమోదు
- ఏప్రిల్ 4లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ

కర్నూలు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీజనల్ హాస్టళ్ల నిర్వహణ పేరిట సాగుతున్న అక్రమాల పర్వంపై ఆంధ్రజ్యోతి 'సీజనల్ దోపిడీ' శీర్షికన వెలుగులోకి తెచ్చిన కథనంపై ఏపీ లోకాయుక్త సీరియస్‌గా స్పందించింది. సుమోటోగా కేసు నమోదు చేసింది. కన్నవాళ్లు వలస వెళితే.. విద్యార్థుల చదువులు మధ్యలో ఆగిపోకూడదని, వారికి రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంగా సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేశారు. అయితే అక్కడ జరుగతున్న అక్రమాలపై విచారణ చేసి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని, సమగ్ర నివేదిక ఏప్రిల్ 4లోగా ఇవ్వాలని సమగ్రశిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్, విద్యా శాఖ కమిషనర్ సహా సంబంధిత అధికారులకు మార్గదర్శకాలు జారీ చేస్తూ మంగళవారం ఏపీ ఉప లోకాయుక్త పి. రజని ఆదేశాలు జారీ చేశారు.

కర్నూలు జిల్లాలో ఇప్పటికే దాదాపు 2.50 లక్షల కుటుంబాలు గుంటూరు, తెలంగాణ ప్రాంతాల్లో పత్తితీత, మిరప కోత పనులకు వలసలు వెళ్లాయి. కన్నవాళ్లతో పాటు చదుకునే విద్యార్థులు కూడా వలస వెళ్తుండడంతో బడిలో హాజరు శాతం తగ్గిపోతోంది. అమ్మనాన్నలు వలస వెళ్లినా.. పేద విద్యార్థులకు రోజూ మూడు పూటల ఆకలి తీర్చి, చదువుకొనేలా చూడాలని, బడిలో హాజరు శాతం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 35 కాలానుగుణ వసతి కేంద్రాలు (సీజనల్ హాస్టళ్లు) ఏర్పాటు చేసింది. ఒక్కో హాస్టల్‌లో 50 మంది విద్యార్థులకు భోజన వసతి కల్పించింది. ఒక్కో విద్యార్థికి రూ.1,000, కేర్ టేకర్, ట్యూటర్, ఇద్దరు వంట మనుషులు రూ.30 వేలు జీతం చొప్పున ఒక్కో సీజనల్ హాస్టల్‌కు రూ.80 వేలు చొప్పున ప్రతి నెల రూ.28 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. సమగ్రశిక్షా అభియాన్, విద్యా శాఖ అధికారుల పర్యవేక్షణలో జరిగే ఈ సీజనల్ హాస్టళ్ల నిర్వహణ ఏజెన్సీ బాధ్యతలు స్వచ్ఛంద సంస్థలు, గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)లకు అప్పగించారు. నిబంధనల మేరకు నిర్వహిస్తున్నారా..? విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్నారా లేదా..? కేర్ టేకర్లు, ట్యూటర్లు ఉన్నారా..? అనే సమస్యలపై మండల విద్యా శాఖ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. ఎంఈవోలు, జిల్లా అధికారులు కళ్లకు గంతలు కట్టుకోవడంతో ఈ సీజనల్ హాస్టళ్ల నిర్వహణ ఇష్టారాజ్యంగా మారింది. పేద విద్యార్థుల కడుపు కొడుతూ కాసుల కక్కుర్తిలో సీజనల్ హాస్టళ్లను దోపిడీ కేంద్రాలుగా మార్చేశారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఆదివారం జిల్లాలో పలు కేంద్రాలను ఆంధ్రజ్యోతి బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వెలుగు చూసిన వాస్తవాలను 'సీజనల్ దోపిడీ' శీర్షికన ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది.

ఏపీ లోకాయుక్త సీరియస్

ఊళ్లో పనులు లేక దేశంలోని వివిధ ప్రాంతాలకు తాత్కాలిక వలస వెళ్లిన కూలీల పిల్లల చదువులకు అంతరాయం ఉండకూడదని ప్రభుత్వం భావించింది. వారికి నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించి ఆకలి తీర్చాలనే లక్ష్యంగా సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేసింది. ఆ హాస్టళ్లను సమగ్రశిక్షా అభియాన్, విద్యా శాఖ అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది. అయినా.. హాస్టళ్ల నిర్వహణలో అక్రమాలు జరుగుతున్నాయని, నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఆంధ్రజ్యోతి దినపత్రిలో 'సీజనల్ దోపిడీ' శీర్షిక వచ్చిన కథనంపై ఏపీ ఉప లోకాయుక్త పి. రజని సీరియస్‌గా స్పందించారు. ఫిర్యాదు నంబరు.486/2025/బీ2 కింద సుమోటోగా స్వీకరించారు. నాణ్యమైన భోజనం వడ్డించడం లేదని, మంజూరు సంఖ్య కంటే తక్కువ విద్యార్థులు ఉన్నారని, హాజరు రిజిస్టర్‌లో ఎక్కువ శాతం చూపించారని, అధికారుల తనిఖీలు నామమాత్రంగా ఉన్నాయని, తనిఖీ చేసినా మార్పు రావడం లేదనే వాటిని ఆమె తీవ్రంగా పరిగణించారు. సీజనల్ హాస్టళ్లను తనిఖీ చేసి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నదీ వివరిస్తూ సమగ్ర నివేదిక ఏప్రిల్ 4లో ఇవ్వాలంటూ సమగ్రశిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్, విద్యా శాఖ కమిషనర్లకు మార్గదర్శకాలతో కూడిన ఆదేశాలను ఉప లోకాయుక్త పి. రజని జారీ చేశారు. సీజనల్ హాస్టళ్లలో ప్రతి రోజు మొత్తం విద్యార్థులు హాజరు అవ్వాలి. ఆహార నాణ్యత, ప్రమాణాలు ప్రకారం స్థిరమైన మెనూను పాటించాలి. ఎంఈవోలు వారంలో రెండు రోజులు తనిఖీ చేయాలి. అందుకు సబంధించిన ఫొటోలు సాక్ష్యాలతో నివేదిక ఇవ్వాలి. జిల్లా విద్యాశాఖ అధికారులు (డీఈవో) నెలలో కనీసం ఒకసారైనా తనిఖీ చేయాలి. అవసరమైన దిద్దుబాటు చర్యలు చేపట్టాలని మార్గదర్శకాలు జారీ చేశారు. ఇప్పటికైనా సీజనల్ హాస్టళ్ల నిర్వాహకులు స్పందించి పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డిస్తారా..? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

స్వల్పంగా పెరిగిన వేరుశనగ ధర

క్వింటం రూ. 6989



విక్రయానికి వచ్చిన వేరుశనగ

ఆదోని అగ్రికల్చర్ , ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో వేరుశనగ ధరలు స్వల్పంగా పెరిగాయి. మంగళవారం వేరుశనగ ధర గరిష్ఠంగా క్వింటాలు రూ. 6,989 పలికింది. గతవారంతో పోల్చితే క్వింటానికి రూ. 300పైగా ధర పెరిగింది. బోరు బావులు కింద సాగైనా వేరుశనగ పంట కోతలు మొదలు కావడంతో రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు. స్వల్పంగా ధర పెరగడంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. క్వింటాలు రూ.8 వేలుకు పైగా ధర పలికితే గిట్టుబాటు అవుతుందని రైతులు చెబుతున్నారు. 7582 వేరుశనగ బస్తాలను రైతుల విక్రయానికి తీసుకురాగా వాటి కనిష్ఠ ధర రూ. 3,096, గరిష్ఠ ధర రూ. 6,989, మధ్యస్థ ధర రూ.6389 పలికింది.

తుంగా తీరంలో రామలింగేశ్వరుడు

నందవరం మండలం గురుజాల రామలింగేశ్వర ఆలయం



- శ్రీరాముడు శివలింగాలు ప్రతిష్ఠించిన ఆలయాలు
- తుంగభద్ర ఒడ్డున ఆధ్యాత్మిక కెరటాలు
- శివరాత్రి ఉత్సవాలకు సిద్ధం

కర్నూలు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదీ జలాలు పరివాహకాన్ని సారవంతం చేస్తున్నాయి. పల్లె ప్రజల దాహం తీరుస్తున్నాయి. దీనితోపాటు తుంగా తీరం పొడవునా ఆధ్యాత్మిక పరిమళాలు వీస్తుంటాయి. ఎన్నో పుణ్యక్షేత్రాలు భక్తుల నీరాజనాలు అందుకుంటున్నాయి. మేళిగనూరు, కందకూరు, రాంపురం, గురుజాల గ్రామాల్లో శ్రీరాముడు శివలింగాలు ప్రతిష్ఠించి పూజలు చేశాడు. అందుకే రామలింగేశ్వర క్షేత్రాలుగా అవి విశిష్టతను సంతరించుకున్నాయి. బుధవారం శివరాత్రి ఉత్సవాలకు తుంగభద్ర తీరంలోని రామలింగేశ్వర ఆలయాలు ముస్తాబవుతున్నాయి.

గురుజాల ఇసుక శివలింగం

తుంగభద్ర నదీతీరంలో నందవరం మండలం గురుజాల గ్రామం చెంత రాముడు ప్రతిష్ఠించిన ఇసుక లింగానికి రామేశ్వరం అంతటి ప్రాధాన్యత ఉంది. రావణ సంహారం తర్వాత శ్రీరాముడు గురుజాలలో ఇసుక లింగాన్ని ప్రతిష్ఠించాడని అంటారు. పాండవులు ఈ క్షేత్రాన్ని సందర్శించినప్పుడు పార్థ (అర్జున) లింగం, భీమ లింగం, ధర్మలింగం ప్రతిష్ఠించారని అంటారు. శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఈ ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు.



రాముడు ప్రతిష్ఠించిన ఇసుక లింగం

రాంపురంలో రామలింగేశ్వరుడు

మంత్రాలయం మండలం తుంగభద్ర తీరంలో రాంపురం గ్రామంలో ఉన్న రామలింగేశ్వర క్షేత్రానికి శివరాత్రి రోజు భక్తులు పెద్ద ఎత్తున వచ్చి పూజలు చేస్తారు. ఈ శివలింగాన్ని కూడా రాముడు స్వయంగా ప్రతిష్ఠించాడని నమ్మకం. ఆలయ ధర్మకర్త వై. సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



రాముడు ప్రతిష్ఠించిన శివ లింగానికి ప్రత్యేక పూజలు



తుంగా జల అభిషిక్తుడు

కోసిగి మండలం కందుకూరు సమీపంలో తుంగభద్ర నది తీరంలో రామలింగేశ్వర క్షేత్రం ఉంది. శ్రీరాముడు తుంగభద్ర నదీజలాలతో ఇక్కడ అభిషేకం చేశాడని అంటారు. శివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.



కోసిగి మండలం కందుకూరులోని రామలింగేశ్వర ఆలయం

ఓ వైపుకు చూస్తున్నట్లుండే మేళిగనూరు శివలింగం

కౌతాళం మండలం మేళిగనూరు దగ్గర నదీ తీరంలో రామలింగేశ్వర క్షేత్రం ఉంది. ఇక్కడ శివలింగం ఒక వైపుకు చూస్తున్నట్లుగా ఉండటం ప్రత్యేకం. ఆలయ పూజారి మల్లికార్జునస్వామి ఆధ్వర్యంలో బుధవారం జరిగే శివరాత్రి ఉత్సవాలకు సన్నాహాలు చేస్తున్నారు.



కౌతాళం మండలం మేళిగనూరు చెంత శ్రీరాముడు ప్రతిష్ఠించిన ఇసుక లింగం

ఒకే చిత్రంలో శివయ్య లీలలు



ఒకే చిత్రంలో శివయ్య లీలలు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని 8ఇంటూ8 పొడవు వెడల్పు గల డ్రాయింగ్ షీట్‌పై వాటర్‌కలర్స్ తో ఒకే చిత్రంలో పరమ శివుని గురించి కొన్ని ప్రధాన ఘట్టాలు సూక్ష్మచిత్రాల ద్వారా చిత్రీకరించారు. శివయ్య భక్తులకు ఆశీస్సులు అందజేస్తున్నట్లు చిత్రించారు. ఈ చిత్రంలో భక్తకన్నప్ప, మార్కండేయులు, శివాజీ మహరాజ్, హనుమంతుని రామకార్యం, శ్రీకాళహస్తీశ్వర మహత్యం, రావణాసురుడు తపస్సు చేస్తున్నట్లు చిత్రం, క్షీరసాగరమదనం నుంచి వచ్చిన విషాన్ని శివుడు సేవిస్తున్నట్లుగా, అర్జునుడు పాశుపతాస్త్రం పొందినట్లు, భగీరథుని భక్తి, కుమారస్వామి, గణపతిస్వాములు ఆదిదంపతులను పూజిస్తున్నట్లు, అక్కమహాదేవి, ఆదిశంకరాచార్యులను సేవిస్తున్నట్లు , హనుమంతుడు శివున్ని ఆరాధిస్తున్నట్లు, ఇలా చిత్రకారుడు చిత్రాలు చిత్రీకరించి అందరిచే శభాష్ అనిపించుకుంటున్నారు.



కోటేష్ చిత్రంలో చిత్రీకరిస్తున్న దృశ్యం

శివపూజకు వేళాయె...

- నేడు మహా శివరాత్రి
- ముస్తాబైన శివాలయాలు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆదిదేవుడైన మహాశివుడికి ఇష్టమైన 'మహా శివరాత్రి' సందర్భంగా బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలోని శ్రీశైలం, మహానంది, యాగంటి, బ్రహ్మగుండం, దుర్గా భోగేశ్వరం, సంగమేశ్వరం, రామునితీర్థం, రుద్ర కోటేశ్వరం, కాల్వబుగ్గ తదితర ప్రముఖ పుణ్యక్షేత్రాలతోపాటుగా, ఆయా పట్టణ, గ్రామ ప్రాంతాల్లోని శైవాలయాల్లో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు, లింగోద్భవ కాల వేడుకలు, శివపార్వతుల కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. భక్తకోటి శివరాత్రి రోజున ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపావాస దీక్షలు పాటిస్తారు. ఓంకార రూపుడైన శివ పంచాక్షరి మంత్ర పఠనం చేస్తూ, రాత్రివేళ జాగరణలు చేస్తూ దేవదేవుని అనుగ్రహానికి పాత్రులయ్యేందుకు సిద్ధమయ్యారు. మహాశివరాత్రి వేడుకలు సందడి ఉమ్మడి జిల్లాలో వారం రోజులు ముందుగానే ప్రారంభమైంది. శ్రీశైలంతోపాటు, మహానంది క్షేత్రాల్లో ఆరంభమైన స్వామివారి బ్రహ్మోత్సవాలను చూసి తరించేందుకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది యాత్రికులు తరలివస్తున్నారు.



జగమంతా శివమయం...

మహాశివుడు ఈ విశాల జగతినంతా వ్యాపించి ఉన్నాడని శివపురాణం చెబుతోంది. పరమ శివుని ఆకృతిలో ఒక్కో అర్థం ఉంది. శివుడు ధరించే త్రిశూలం సత్వ రజో, తమో గుణాలకు ప్రతిరూపాలు. ఢమరుకం శబ్ద బ్రహ్మ స్వరూపం. శివయ్య తన శిరస్సున ధరించిన నెలవంక మనోనిగ్రహానికి, గంగాదేవి శాశ్వతత్వానికి ప్రతీకలుగా నిలుస్తారు. ఆయన ధరించిన ఏనుగు చర్మం అహంకారాన్ని త్యజించమని చెబుతుంది. ఆసీనంపై ఉన్న పులిచర్మం కోరికలకు దూరంగా ఉండమని చెబుతుంది. నుదుట ధరించే భస్మం పరిశుద్ధతనూ, నందీశ్వరుడు సత్సంగానికి, మూడవ నేత్రం జ్ఞానానికి సూచికలుగా నిలుస్తాయి. శివుడంటే మానవులకు సర్వ శుభాలను కలిగించే దైవమని మహాభారతంలో శ్రీకృష్ణుని వచనం. అగస్త్య మహర్షి శివుడిని 'అచింత్యరూపం అవ్యక్తం అనంతం అమృతం శివమ్' అని వర్ణించాడు. అంటే చింతించుటకు వీలుకానివాడు, అవ్యక్త స్వరూపుడు, అనంతుడు, అమృత స్వరూపమైన పరబ్రహ్మయే శివుడని అర్థం. జ్ఞానరహిత భక్తి కూడా కొన్ని రోజులే ఉంటుంది. జ్ఞానములేని భక్తి, గాలివీస్తే ఎగిరిపోయే దూదిపింజలాంటిది. జ్ఞానముతో కూడిన భక్తి, హోరుగాలి వీచినా చలించని మేరు పర్వతంలా ఉంటుందని అగస్త్య మహర్షి శివుని గురించి ప్రబోధించారు.

అఖిల భారత ఛాంపియన్ షిప్ పోటీల్లో పీడీ బాషా

సంజామల, ఫిబ్రవరి 25: అఖిల భారత సివిల్ సర్వీసు అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాల వ్యాయామ సంచాలకుడు బాషా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి భారత ప్రభుత్వం నుంచి ప్రశంస పొందారు. ఈ నెల 19 నుండి 21 వరకు పంజాబ్ రాష్ట్రంలోని ఛండీగడ్‌లో జరిగిన అఖిల భారత ఉద్యోగులకు భారత ప్రభుత్వం నిర్వహించి ఆలిండియా సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో నంద్యాల జిల్లా సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పి.డి పోటీలో పాల్గొన్నారు. షార్ట్‌పుట్ త్రో 42 - 50 పురుషుల విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశ వ్యాప్తంగా 8వ స్థానం దక్కించుకున్నారు. భారత ప్రభుత్వం నుంచి ప్రశంస పత్రాన్ని పొందారు. ఈ సందర్భంగా పాఠశాలలో హెచ్.ఎం శంకర్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయనను ఉపాధ్యాయులు అభినందించి సన్మానించారు.

1న నారా లోకేశ్ రాక



మంత్రాలయం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి గురువైభవోత్సవాలకు వచ్చేనెల 1 న రాష్ట్ర ఐటీ శాఖమంత్రి నారా లోకేశ్ మంత్రాలయానికి రానున్నట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో నిర్వహించనున్న గురువైభవోత్సవాల ప్రారంభ వేడుకల్లో మంత్రి నారా లోకేశ్ పాల్గొంటారన్నారు. లోకేశ్‌కు గురువైభవోత్సవం-2025 అవార్డును పీఠాధిపతి అందజేస్తారన్నారు. మంత్రి పర్యటన ఖరారు కావడంతో హెలిప్యాడ్‌ను సిద్ధం చేస్తున్నట్లు వివరించారు.

ఇంతింతై వటుడింతై..

శివదీక్ష సర్వపాపహరణం



శ్రీశైలం (కోడుమూరు రూరల్), ఫిబ్రవరి 25 ఆంధ్రజ్యోతి: నియమనిష్ఠలతో కూడిన శివదీక్ష సర్వపాపహరణం. శివదీక్ష చేపట్టేవారి సంఖ్య ఏటేటా పెరుగుతోంది. ఈ శివదీక్ష సరిగ్గా 31 ఏళ్ల క్రితం పరిమిత సంఖ్యలో ప్రారంభమైంది. అందుకు ఆద్యుడు అప్పటి దేవస్థాన ఈవో వంగాల శంకరరెడ్డి. మంగళవారం ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడుతూ. 1994 సంవత్సరంలో ఈవోగా బాధ్యతలు చేపట్టడానికి రాగా అదేసమయంలో అయ్యప్పదీక్ష మాలధారులు స్వామిఅమ్మవార్లను దర్శించుకుని వస్తూ తారసపడ్డారు. దీంతో శివదీక్ష ఆలోచన వచ్చింది. ఈ విషయంపై పీఠాధిపతులు, మఠాధిపతులు, ఆగమశాస్త్ర పండితులతో సమావేశం నిర్వహించి విధివిధానాలు రూపొందించారు. ఆపై ప్రభుత్వ అనుమతి తీసుకున్నాం. అదే ఏడాది శివరాత్రి ముందు ఈవో, దేవస్థాన సిబ్బంది, దుకాణదారులతో 300 మంది శివదీక్ష తీసుకున్నారు. అలా శివదీక్ష తీసుకున్న వారిని టీంలుగా విభజించి వివిధ ప్రాంతాలకు పంపారు. ఆవిధంగా విస్తృత ప్రచారం కల్పించారు. తొలిసారి రెండేళ్ల బాధ్యతలు నిర్వహించిన ఈవో శంకరరెడ్డి తదుపరి కాలంలో మరో రెండుమార్లు ఈవోగా వ్యవహరించారు. ఇప్పుడు ఏటా లక్షల సంఖ్యలో శివదీక్షను చేపట్టి పరమేశ్వరుడి సేవలో తరిస్తున్నారు.

ఏమివ్వాలో శివయ్యకు తెలుసు



చిత్తశుద్ధితో ఆదిదేవుడిని సేవించాలి. ఎవరికి ఏమివ్వాలో శివయ్యకు తెలుసు. శివదీక్ష నాంది దైవసంకల్పం. మల్లన్నస్వామి ఆదేశమే చేయించిదనుకుంటా. నాడు శివదీక్ష ప్రారంభానికి బీజం పడడం పూర్వజన్మ సుకృతం. ఇప్పటికి ఏటా శివదీక్షలో ఉంటాను.

వంగాల శంకరరెడ్డి, విశ్రాంత ఈవో

ప్రశాంతంగా పది పరీక్షలు నిర్వహించాలి

- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలి
- కాపీయింగ్, మాల్ ప్రాక్టీసు జరగకూడదు : కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరిగే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు, మార్చి 17 నుంచి 28 వరకు జరిగే పదో తరగతి ఓపెన్ పరీక్షలకు, మార్చి 3 నుంచి మార్చి 15వ వరకు జరిగే ఇంటర్మీడియట్ ఓపెన్ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. జిల్లాలో 172 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 40,776 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. సమీక్షలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

శ్రీగిరి.. భక్తసిరి

- మల్లన్న కల్యాణానికి తరలివస్తున్న లక్షలాది భక్తులు
- నల్లమలలో మారుమోగుతున్న శివనామస్మరణ

శ్రీశైలం (కోడుమూరు రూరల్), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించనున్న పాగాలంకరణ, స్వామి అమ్మవార్ల కల్యాణం చూడ్డానికి లక్షలాదిగా భక్తులు తరలివస్తున్నారు. పాదయాత్రగా వస్తున్న భక్తుల శివనామస్మరణతో నల్లమల మారుమోగుతోంది. బ్రహ్మోత్సవాలలో ప్రధానంగా పాగాలంకరణ, లింగోద్భవం, కల్యాణం, రథోత్సవం, తెప్పోత్సవం కనులారా వీక్షించి భక్తులు తరిస్తారు. వేడుకలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి భక్తులు వస్తారు. భక్తులతో శ్రీగిరి నిండిపోయింది.





ఆయనే సాక్ష్యం

శ్రీగిరి క్షేత్ర దర్శనానికి ముందు భక్తులు సాక్షిగణపతిని దర్శించుకుంటారు. శ్రీశైలానికి మూడు కి.మీ దూరంలో ఉన్న సాక్షిగణపతి ఆలయాన్ని దర్శించుకోవడం ఆనవాయితీ. తనను దర్శించుకున్న ప్రతి భక్తుడి పేరును మల్లన్నకు గణనాథుడు తెలియజేశారని భక్తుల నమ్మకం. అందుకే ఇక్కడ వెలసిన గణనాథుడిని సాక్షి గణపతి అంటారు.

ఖాళీ ప్రదేశాలే..

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు, పాదయాత్రికులు మల్లన్న దర్శించుకుంటున్నారు. అనంతరం రోజువారీ ఉత్సవాలను వీక్షించి ఆరుబైటే నిద్రకు ఉపక్రమిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం వేసిన చలువ పందిళ్లు చాలక ఖాళీ ప్రదేశం, వసతి సముదాయాల ముందు ప్రాంగణాలు, ఫుట్‌పాత్‌లను పానుపుగా చేసుకుంటున్నారు.

ఊరికి దూరంగా...

- బొమ్మనపల్లిలో వింత ఆచారం
- సంతానాభివృద్ధి కోసం వనభోజనం
- 200 ఏళ్లుగా వస్తున్న సంప్రదాయం

మద్దికెర, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : బొమ్మనపల్లి... మద్దికెర మండలంలోని చిన్న గ్రామం. టెక్నాలజీ దూసుకుపోతున్నా, గ్రామంలో ఎంతో మంది చదువుకున్న వాళ్లు ఉన్నా శతాబ్దాలుగా వస్తున్న ఆచారాన్ని మాత్రం వీడటం లేదు ఆ గ్రామస్థులు క్రమం తప్పకుండా ప్రతి ఏటా ఓ ఆచాన్ని కొనసాగిస్తున్నారు. చూసేవారికి వింతగా ఉన్నప్పటికీ బొమ్మనపల్లి గ్రామస్థులు మాత్రం చాలా నియమనిష్ఠతో, భక్తిశ్రద్ధలతో ఆచారాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో శివరాత్రికి ముందు రోజు అందరూ గ్రామాన్ని వదిలేసి ఊరి బయటకు వెళ్తారు. 200ఏళ్ల కిందట ఓ స్వామీజీ చెప్పిన మాటకు కట్టుబడిన గ్రామస్థులు మంగళవారం ఇళ్లకు తాళాలు వేసి పిల్లాపాపలతో ఉదయం 6 గంటలకు గ్రామ శివారుకు వెళ్లిపోయారు. అక్కడే చెట్ల కింద సేద తీరుతూ వనభోజనాన్ని చేసుకుని సాయంత్రం గ్రామానికి చేరుకుని అమ్మవారికి పూజలు చేసి తమ ఇళ్లకు వేసిన తాళాలు తీసి పూజలు చేసుకున్నారు.

రెండు శతాబ్దాలుగా ఇదే ఆచారం..

ఈ వనభోజనానికి 200 ఏళ్ల నాటి చరిత్ర దాగి ఉంది. బొమ్మనపల్లి గ్రామంలో మొత్తం 250 కుటుంబాలు నివసిస్తున్నాయి. దాదాపు గ్రామంలో 1300 ఓట్లు ఉన్నాయి. సుమారు 200 ఏళ్ల క్రితమే గ్రామంలో సంతానం కలగడం లేదని, చాలా మంది ఇబ్బందులు పడుతుండేవారు. అయితే అప్పటి గ్రామ పెద్దలు గ్రామంలోని కాశీంతాత స్వామి దగ్గరకు వెళ్లారు. ఆ స్వామి మాఘమాసంలో శివరాత్రికి ముందు రోజు అది కూడా మంగళవారం గ్రామంలో ఒక్కరూ కూడా ఉండకుండా ఉదయం 6 గంటలకే ఇళ్లను శుభ్రం చేసుకోకుండా తాళాలు వేసి గ్రామ శివార్లకు వెళ్లి చెట్ల కింద వనభోజనాలు చేసుకుంటే మీ గ్రామంలో సంతానం అభివృద్ధి జరుగుతుందని తెలపడంతో.. ఆనాటి నుంచి నేటి వరకు ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. గ్రామంలోని పిల్లాపాపలు, పెద్దలు అందరూ ఇళ్లకు తాళాలు వేసి వెళ్లారు. గ్రామ శివారులోని ఎవరికి కావాల్సిన వారు ఒక్కో చెట్టుకింద ఉంటూ వంటా వార్పును చేసుకుని వనభోజనాన్ని నిర్వహించుకున్నారు. కొన్నేళ్ల కిందట ఒక సంవత్సరం ఈ సంప్రదాయాన్ని నిలిపివేయడం వల్ల అశుభం జరగడంతో తిరిగి యథావిధిగా ఈ సంప్రదాయాన్ని కొనసా గిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. సాయంత్రం చెట్లకింద ఉన్న వారు అందరూ ఒకేచోటకు చేరుకుని అఖండ దీపం ద్వారా వచ్చి గ్రామంలోని సుంకులమ్మ అమ్మవారికి పూజలు చేసి ఇళ్లకు వెళ్లారు.



పిల్లాపాపలతో శివారులోని చెట్టుకిందకు చేరిన గ్రామస్థులు



సహపంక్తి భోజనం

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడాకారులతో ఆర్‌యూ ఉప కులపతి, రిజిస్ట్రార్లు

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయాల హ్యాండ్‌బాల్ పురుషుల పోటీలు ఈ నెల 27 నుంచి మార్చి 3వరకు తమిళనాడులోని సేలంలో పెరియార్ యూనివర్సిటీలో జరుగనున్నాయి. ఈ పోటీల్లో ఆర్‌యూ జట్టు పాల్గొననుంది. వీసీ వి.వెంకట బసవరావు క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. ప్రతిభ కనబరిచి యూనివర్సిటీకి పేరు తేవాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కేవీ శివకిశోర్, ఆర్‌యూ కోచ్ ప్రభాకర్, దుర్గ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అత్తింటి వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నది. ఈ సంఘటన మంగళవారం కోవెలకుంట్లలో జరిగింది. పట్టణానికి చెందిన హరిణి అనే మహిళ అదే పట్టణానికి చెందిన షాదిక్‌హుసేన్‌ను ప్రేమించి మూడు సంవత్సరాల కిందట వివాహం చేసుకుంది. ఇటీవలనే భర్త సాదిక్‌హుసేన్, అత్త మహబూబ్‌బీ, మామ జాఫర్‌హుసేన్‌లు హరిణిని వేధిస్తున్నారని, అందువల్లే ఆమె సోమవారం రాత్రి ఉరేసుకుందని మృతురాలి సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఫిర్యాదు చేశారన్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హరిణి భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్యాపిలి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పట్టణ సమీపంలోని పెట్రోలు బంక్ దగ్గర మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. పట్టణంలోని వెంకటరెడ్డికాలనీకి చెందిన గోపాల్(56) కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడు. పనికి వెళ్లే సమయంలో రోడ్డు దాటుతుండగా ఎక్స్‌కవేటర్ ఢీకొంది. గోపాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని డోన్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మధుసూదన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తా.. మహిళా కూలి దుర్మరణం

- 10 మందికి గాయాలు

నంద్యాల నూనెపల్లె, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊడుమాల్పురం గ్రామ సమీపంలో వ్యవసాయ కూలీలు ప్రయాణిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడటంతో ఓ మహిళ మృతి చెందారు. నంద్యాల ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. పాణ్యం మండలం తొగడ్చేడు తదితర చుట్టుపక్కల గ్రామాల నుంచి వ్యవసాయ కూలీలు ఓ ట్రాక్టర్ ట్రాలీలో నంద్యాల మండలంలోని ఊడుమల్పురం గ్రామంలో పొగాకు కోసేందుకు మంగళవారం వచ్చారు. పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో తొగర్చేడు గ్రామస్థురాలు నాగమ్మ (48) అక్కడికక్కడే మృతి చెందగా ట్రాలీలో ప్రయాణిస్తున్న 10 మంది కూలీలు గాయపడ్డారు. ట్రాలీలో పరిమితికి మించి 31 మంది కూలీలను ఎక్కించుకోవడంతో అదుపు తప్పి బోల్తా పడినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నాగమ్మ మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నాగమ్మ కుమార్తె అనిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కర్నూలులో మరో యువకుడు..

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన నగరంలోని కోడుమూరు రహదారిలో మంగళవారం చోటు చేసుకున్నది. పోలకల్లు గ్రామానికి చెందిన మహేంద్ర (30), భార్య, కూతురుతో కలిసి రాజీవ్ గృహకల్పలో నివాసముంటున్నాడు. భార్య ఊరుకు వెళ్లడంతో తన మిత్రుడు లింగంతో కలిసి బైక్‌పై బళ్లారి చౌరస్తాకు వచ్చాడు. ఓ హోటల్ టిఫిన్ చేసి తిరిగి వెళ్తుండగా, మరిచిపోయిన సెల్‌ఫోన్‌ను తెచ్చుకునేందుకు మళ్లీ యూటర్న్ తీసుకుంటుండగా గుర్తు తెలియని వాహనం వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లింగంకు గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇంటిస్థల విషయంలో ఓ వ్యక్తిపై దాడి చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుత్తిగారి జయరామిరెడ్డి, రామగోపాల్‌రెడ్డి అనే వ్యక్తులు ఇంటి స్థలం విషయంలో నబీరసూల్‌పై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పెట్నీకోటలో ఫోర్జరీ సంతకాల ఘటనలో కేసు నమోదు..

మండలంలోని పెట్నీకోట గ్రామంలో పెద్దుగాళ్ల సుబ్బమ్మ పేరుమీద ఉన్న నాలుగు ఎకరాల పొలాన్ని ఫోర్జరీ సంతకాలు చేసి, రిజిస్ట్రేషన్ చేశారని, పెద్దుగాళ్ల రామేశ్వరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. గ్రామానికి చెందిన నాగేందర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, మరికొందరు కలిసి, సుబ్బమ్మ ప్రమేయం లేకుండా, అదే పేరున్న మరో మహిళతో ఫోర్జరీ సంతకాలు చేయించారన్నారు. బాధితుల ఫిర్యాదుమేరకు సదరు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు.

చోరీ కేసులో ఏడాది జైలు

ఆలూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలగవల్లి గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో గత ఏడాది ఏప్రిల్ 4వ తేదిన జరిగిన చోరీ కేసులో అనంతపురం జిల్లాకు చెందిన సరవ భాస్కర్ ఆచారికి ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏడాది జైలు శిక్ష విధించినట్లు ఆలూరు ఎస్‌ఐ దిలీప్ కుమార్ తెలిపా రు. రైతు భరోసా కేంద్రం తాళం పగులకొట్టి, అక్రమంగా ప్రవేశించి ఎల్‌ఈడీ టీవీ, వాషింగ్ మిషన్, ప్రెజర్ కుక్కర్, కిట్, మాయిశ్చరైజర్ మిషన్, ఎల్‌ఈడీ లైట్స్ చోరీ జరగడంతో అప్పట్లో కేసు నమోదు చేశామని చెప్పారు. అనంతపురం జిల్లాకు చెందిన సరవ భాస్కర్ ఆచారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా విచారణ జరిపిన న్యాయమూరి ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

ప్యూర్ కంపెనీ ఎండీకి అరెస్టు వారెంట్

కర్నూలు లీగల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ టూ వీలర్ కంపెనీ అయిన ప్యూర్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఎండీకి అరెస్టు వారెంటు జారీ చేస్తూ జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్, సభ్యులు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. కర్నూలు నగరంలోని సుంకేసుల రోడ్డులో నివాసం ఉంటున్న జి.నిర్మలాదేవి 2022లో ఒక ఎలక్ట్రిక్ టూ వీలర్‌ను రూ.97,800కు కర్నూలులో కొనుగోలు చేశారు. కంపెనీ నిబంధనల మేరకు స్కూటర్ 80 కిలోమీటర్లు వరకు బ్యాటరీ మైలేజీ ఇవ్వాల్సి ఉంది. అయితే.. ఆ స్కూటర్ 5 కిలో మీటర్లకే బ్యాటరీ చార్జింగ్ అయిపోయి ఆగిపోతుండటంతో ఆ మహిళ పలుమార్లు స్థానిక బంగారుపేటలోని డీలర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా స్కూటర్‌లోని లోపాలను కంపెనీ సరి చేయలేకపోయింది. దీంతో విసిగిపోయిన మహిళ జిల్లా వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసును పరిశీలించిన జిల్లా వినియోగదారుల కమిషన్ మహిళ కొనుగోలు చేసిన 2 వీలర్‌లో లోపాలు సరిచేయకపోవడం సేవాలోపం అవుతుందని 2023లో నిర్ధారిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఫిర్యాదికి వాహనం ఖరీదు రూ.97,800లను 9 శాతం వడ్డీతో పాటు కోర్టు ఖర్చులు నష్టపరిహారం కింద అదనంగా మరో రూ.25వేలు చెల్లించాలని గత ఏడాది కంపెనీకి ఆదేశాలు జారీ చేసింది. తీర్పు కాపీ అందిన తర్వాత కూడా కంపెనీ కమిషన్ ఆదేశాలను ఖాతరు చేయలేదు. దంతో హైదరాబాదులోని ప్యూర్ ఎలక్ట్రిక్ కంపెనీ ఎండీకి అరెస్టు వారెంటు జారీ చేస్తూ కేసును వచ్చే నెల 24వ తేదీకి వాయిదా వేస్తూ జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ కరణం కిషోర్ కుమార్, సభ్యులు ఎన్.నారాయణ రెడ్డి, నజీమా కౌసరు ఆదేశాలు జారీ చేశారు.

కలాం పాఠశాలకు సొంత భవనం నిర్మించాలి



అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం

- ఆగిపోయిన పనులు
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తల్లిదండ్రుల విజ్ఞప్తి

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు, ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డులు సొంతం చేసుకున్న ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభు త్వానికి విజ్ఞప్తి చేశారు. 2021 నవంబరు 29వ తేదీన 46వ వార్డులో రూ.2కోట్లతో మేయర్ బీవై రామయ్య భవ నానికి శంకుస్థాపన చేశారు. దాదాపు నాలుగు సంవత్స రాలు గడచినా భవన నిర్మాణం చేపట్టలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్ బాషాకు ఫిర్యాదు చేశారు.

ఈ పాఠశాలలో 212 మంది విద్యా ర్థులు చదువుతు న్నారు. 2017 నుంచి 2024 వరకు రాష్ట్రంలో 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణుల య్యారు. ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు 2024 వరకు 182 మంది ఎంపికయ్యారు. ప్రతిభ అవార్డులు కూడా అందుకున్నారు. ఆర్‌జీయూకేటీకి 36 మంది సెలెక్ట్ అయ్యారు. 2022, 2023, 2024 రాష్ట్ర స్థాయిలో బెస్ట్ స్కూల్ అవార్డులను సైతం కైవసం చేసుకున్నారు. ఏపీఆర్‌జేసీ పాలిటెక్నిక్ తదితర పోటీ పరీక్షలకు విద్యార్థులు ఎంపిక అవుతు న్నారు. అలాంటి పాఠశాలకు శాశ్వత భవనం లేదు.

పేద విద్యార్థులకు న్యాయం చేయాలి



ఈ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యా యులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో అవార్డు అందుకుంటున్నారు. భవనాన్ని త్వరగా నిర్మించాలి. ఈ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు అప్పుడే న్యాయం జరుగు తుంది. **- సుధ, విద్యార్థి తల్లి**

అధికారులు పట్టించుకోవడం లేదు



పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ నాలుగు నెలల క్రితం తల్లిదండ్రుల కమిటీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కానీ అధికారులు పట్టించుకోలేదు. **- రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్, తల్లిదండ్రుల కమిటీ.**

విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడాలి



పాఠశాల శాశ్వత భవన నిర్మాణానికి2021 నవంబరు 29న రూ.2 కోట్లతో నగర మేయర్ బీవై రామయ్య శంకుస్థాపన చేశారు. నాలుగు సంవత్సరాల నుంచి పురోగతి లేదు. భవనం నిర్మిస్తే విద్యాభివృద్ధికి దోహదపడుతుంది. **- గౌసియా బేగం, అధ్యక్షురాలు, తల్లిదండ్రుల కమిటీ**

పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేయాలి

పాఠశాలకు కంప్యూటర్లను అందజేయాలని డీఈవో శ్యాముల్ పాల్‌ను అలాగే భవన నిర్మాణాన్ని పూర్తిచేసి, వచ్చే విద్యాసం వత్సరం తరగతులను నిర్వహించేలా చూడాలని మునిస్పల్ కమిషనర్ రవీంద్రబాబును ఆదేశించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే సీజ్ చేయండి



తుంగభద్రను పరిశీలిస్తున్న అధికారులు

- ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్
- తుంగభద్ర నదిలో ఇసుక పరిశీలన
- నదీ తీర గ్రామాల వీఆర్వోలు, కార్యదర్శులతో సమావేశం

మంత్రాలయం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే వాహనాలను సీజ్ చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం మంత్రాలయంలోని తుంగభద్ర నది నుంచి శ్మశానం, దర్గా సమీపంలోని ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలోని గ్రామాల కార్యదర్శులు, వీఆర్వోలు, పోలీసు అధికారులతో ఇసుక అక్రమ రవాణాపై చర్చించారు. మంత్రాలయం, మాధవరం, చెట్నహళ్లి తదితర ప్రాంతాల నుంచి ఎమ్మిగనూరు ఇతర గ్రామాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్నారు. వీటికి అడ్డుకట్ట వేసేందుకు వీఆర్వోలు, వీఆర్‌ఏలు, గ్రామ కార్యదర్శులు నిఘా ఉంచాలన్నారు.

నదీతీర గ్రామాల్లోని ప్రభుత్వ గృహాలకు, సాధారణ గృహాలకు మాత్రమే నది నుంచి ఇసుకను తీసుకెళ్లాలని, పెద్ద పెద్ద భవంతులు, లాడ్జీలు, హోటళ్లు, దుకాణాల నిర్మాణాలు ఎటువంటి పరిస్థితుల్లో తుంగభద్ర నది నుంచి ఇసుక రవాణా చేస్తే అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ రవి, మంత్రాలయం సీఐ రామాంజులు, ఎంపీడీవో శోభారాణి, ఈవోఆర్‌డీ ప్రభావతిదేవి, డిప్యూటీ తహసీల్దార్లు టీకే గురురాజరావు, జయరామిరెడ్డి, ఆర్‌ఐ ఆదాం, ఏఎస్‌వో సూర్య ప్రకాష్, వీఆర్వో భీమన్నగౌడు, గ్రామ కార్యదర్శులు నాగరాజు, వేణుగోపాల్, ఇజ్రత్ బాషా, మహేష్, జయలక్ష్మి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుల ఎంపిక

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పరిధిలోని మండలాలకు అధ్యక్షులుగా పలువురిని నియమిస్తూ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా అధ్యక్షుడు జెంగిటి నరసింహ యాదవ్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి నూతన మండలాధ్యక్షులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల వైఫల్యంపై ప్రజల్లో ప్రచారం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

చెరుకు పంట దగ్ధం



దగ్ధమైన పంటను చూపుతున్న బాధితుడు

మంత్రాలయం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో చెరుకు పంట అగ్నికి ఆహుతైంది. ఈ ఘటన మాధవరం గ్రామ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మాధవరం తుంగభద్ర నది బ్రిడ్జి సమీపంలో కురువ గుడిసె నాగుడు అనే రైతు ఎకరా పొలం కౌలుకు తీసుకొని చెరకు పంట సాగు చేశాడు. అక్కడే రోడ్డుపక్కన చెరుకు మిషన్ ఏర్పాటు చేసుకుని వచ్చి వెళ్తున్న ప్రయాణికులను చెరుకు రసం విక్రయిస్తూ జీవనం సాగించేవాడు. అయితే మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో చెరకు దగ్ధం కావడం గమనించి లబోదిబో మంటూ కేకలు వేస్తూ చుట్టుపక్కవారిని పిలిచి నీరు చల్లి మంటలను ఆర్పే ప్రయత్నం చేశాడు. అప్పటికే మంటలు వ్యాపించి చెరుకు పంటంతా కాలిబూడిదైంది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఎమ్మిగనూరు అగ్నిమాపక కేంద్రం ఎస్‌ఐ వెంకటేశ్, సర్దార్ బాషా, ఆంజినేయ రమేష్ వచ్చి ఇతర పంటలకు మంటలు వ్యాపించకుండా ఆర్పివేశారు. దాదాపు రూ. ఐదు లక్షల నష్టం వాటిల్లిందని రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. చేతికి వచ్చిన పంట అగ్నికి ఆహుతైందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

కొత్తపల్లి వరిగడ్డికి నిప్పు..



దగ్ధమవుతున్న గడ్డివామి

కొత్తపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో మంగళవారం ప్రమాదవశాత్తు ఆరు వరిగడ్డి వాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన పాతకోట వెంకటరమణకు చెందిన మూడు గడ్డివాములు, మల్లయ్యకు చెందిన మూడు గడ్డివాములు మంటలకు కాలిపోయాయి. బాధితులు మాట్లాడుతూ మూగజీవాలకు వరిగడ్డి లేకపోవ డంతో ఇతర ప్రాంతాల నుంచి సుమారు 30 బండ్ల వరిగడ్డిని కొనుగోలు చేసి గడ్డివాములను ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. కొందరు ఆకతాయిలు సిగరెట్, బీడి తాగి పడేయడం వల్లనే మంట రాజేసుకుని గడ్డివాములు దగ్ధమై ఉంటాయని అను మానం వ్యక్తం చేస్తున్నారు. ఆత్మకూరు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది హుటాహుటిన వెళ్లి మంటలను అదుపులోకి తేవడంతో సమీపంలో ఉన్న గడ్డివాములకు ప్రమాదం తప్పడం వల్ల రైతులు ఊపిరి పీల్చుకున్నారు. సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని బాధితులు తెలిపారు.

టీవీల దుకాణంలో మంటలు

మంత్రాలయం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాఘవేంద్ర సర్కిల్ సమీపంలో సూగూరు మజీద్‌కు చెందిన టీవీల రిపేరి దుకాణం దగ్ధమైంది. మంగళవారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. దుకాణంలో ఉన్న టీవీలు, ఇతర వస్తువులు కాలి బూడిద అయ్యాయి. రూ.3 లక్షలు దాక నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు

- వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి
- కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):

రోగులకు మెరుగైన సేవలు అందించాలని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కే.వెంకటేశ్వర్లు ఆదేశించారు. మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్య శాల ధన్వంతరి హాల్‌లో హెచ్‌వోడీలతో ఐవీఆర్‌ఎస్ ఎన్టీఆర్ వైద్యసేవ ఈ-హాస్పిటల్‌పై సూపరిం టెండెంట్ సమీక్షించారు. ప్రభుత్వ వైద్యసేవలు ప్రజలకు చేరువ కావాలని, ప్రభుత్వం ఇటీవల ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్‌లోని ఆరు అంశాలపై కాల్స్, వాట్సాప్, క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్‌బ్యాక్ తీసుకుంటుందని వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

వైద్యులు సమయపాలన పాటించాలని, రోగులతో మర్యాదపూ ర్వకంగా ప్రవర్తించాలని హెచ్‌వోడీలకు సూచించారు. నూతనంగా వచ్చే 250 మంది హౌస్ సర్జన్లకు ఎఫ్‌ఆర్‌ఎస్, డ్రెస్ కోడ్, ఐడీ కార్డులు, అటెండెన్స్‌ను రెగ్యులర్‌గా అమలు చేయాలన్నారు. ఆసుపత్రిలో వైద్య పరీక్షలకు బయటకు పంపించవద్దని సూచించారు. త్వరలో పలు ఓపీ విభాగా లను తనిఖీ చేస్తామన్నారు. సమావేశంలో డిప్యూటీ సీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ శ్రీరాములు, సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల, డాక్టర్ కిరణ్ కుమార్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు డాక్టర్ సి.శ్రీనివాసులు, డాక్టర్ ఇక్బాల్ హుశేన్, డాక్టర్ లక్ష్మిబాయి, డాక్టర్ హరిచరణ్ పాల్గొన్నారు.

ఆసుపత్రిలో మందుల కొరత లేదు

ఆసుపత్రిలో మందుల కొరత లేదని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కే.వెంకటేశ్వర్లు వెల్లడించారు. మంగళవారం చాంబర్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆసుపత్రిలో అన్ని రకాల మందులున్నాయని, అత్యవసర మందుల కోసం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొన్ని మందులను లోకల్ పర్చేజ్‌లో కొనుగోలు చేస్తున్నామన్నారు. వైద్యులు బయటకు రాస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీఎంబీజేకే ద్వారా, లోకల్ ఏజెన్సీ నుంచి అత్యవసర మందుల కొనుగోలు చేసినట్లు చెప్పారు. క్షతగాత్రులు అత్యవసర విభాగానికి వస్తే ఎక్స్‌రే, స్కానింగ్ తీసుకెళ్లేందుకు స్ట్రెచ్చర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. సూపరింటెండెంట్ కార్యాలయంలో కొందరు ఉద్యోగులకు స్థానచలనం కల్పించనున్నట్లు ఆయన తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి: ఆర్డీవో

కోడుమూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ఆర్డీవో కె.సందీప్ కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తహసీల్దార్ వెంకటేశ్‌నాయక్, సీఐ తబ్రేజ్, ఎంపీడీవో రాముడు, ఇరిగేషన్ ఏఈ మోహన్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మండల పరిధిలో నుంచి అక్రమంగా ఇతర గ్రామాలకు ఇసుక తరలివెళ్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయని, అధికారులు సంయుక్తంగా అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని అన్నారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి గ్రామంలో కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కమిటీలో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, మహిళ పోలీస్, ఇంజనీర్ అసిస్టెంట్లు ముఖ్య పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు.

సౌత్‌జోన్ షూటింగ్ బాల్ పోటీల అబ్జర్వర్‌గా పరశురాముడు

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మార్చి ఒకటి నుంచి 3వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాలోని నలంద కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్న నాలుగో సౌత్‌జోన్ షూటింగ్ బాల్ పోటీల అబ్జర్వర్‌గా పరుశురాముడును నియమించినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. దానికి సంబంధించిన ఉత్తర్వులు షూటింగ్ బాల్ ఫెడ రేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జీత్‌రాజ్ తోమర్ నుంచి ఉత్తర్వులు అందించినట్లు తెలిపారు. పరశురాముడు ప్రస్తుతం ఏపీ షూటిం గ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నట్లు తెలిపారు. గతంలో ఏషియన్, వరల్డ్ కప్ షూటింగ్ బాల్ పోటీల్లో భారత జట్టు మేనేజర్‌గా వ్యవహరించినట్లు ఆయన తెలిపారు.

నగర ఆలయాలకు 'శివరాత్రి' శోభ

జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వర క్షేత్రానికి ఆర్టీసీ బస్సులు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదిన వేడుకలకు శైవ దేవాలయాలు ముస్తాబయ్యాయి. బుధవారం వేకువజాము నుంచే విశేష పూజలు, అభిషేకార్చనలతో వేడుకలను భక్తిశ్రద్ధలతో ప్రారంభిస్తున్నారు. ఆయా దేవాలయాల్లో భక్తులకు ఎలాంటి లోటుపాటు లేకుండా క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. అలాగే ఎండల తీవ్రత బాగా ఉన్నందున మంచినీళ్లు అందుబాటులో పెట్టడంతోపాటు, ఆలయాల వద్ద చలువపందిళ్లు వేశారు. నగర శివారులో జగన్నాథగట్టుపై వెలసిన రూపాల సంగమేశ్వర స్వామి క్షేత్రానికి వెళ్లేందుకు భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ అభివృద్ధి సమితి ప్రతినిధులు పి. నరసింహారెడ్డి, ఎస్. శ్రీనివాసరెడ్డి, ఇ. మల్లికార్జున రెడ్డి, ఈవో వై గుర్రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం 5 గంటల నుంచి స్వామివారికి అభిషేకాలు చేస్తున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు స్వామివారికి అలంకరణ, అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకాలు నిర్వహించనున్నారు. గురువారం వేకువజామున 3 గంటలకు శివపార్వతుల కల్యాణం, స్వామివారి ప్రాకార పల్లకి సేవ, ఉదయం 10 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమాలు చేపట్టనున్నారు. కాగా గట్టుపైకి వచ్చే భక్తులందరికీ దిన్నెదేవరపాడుకు చెందిన పెరుగు సీతారామిరెడ్డి, ఆయన కుమారుల ఆధ్వర్యంలో నిరంతర ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.



విద్యుద్దీపాలంకరణలో బుగ్గ రామేశ్వరస్వామి ఆలయం, భక్తులను ఆకట్టుకుంటున్న ప్రభ

● **హరిహర క్షేత్రంలో..** నగరంలోని సంకల్‌బాగ్‌లో తుంగభద్ర నది ఒడ్డున వెలసిన హరిహర క్షేత్రంలోని భవానీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు స్వామివారి రథోత్సవం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సందేల్ చంద్రశేఖర్, చల్లా నాగరాజ శర్మ తెలిపారు.

● **లలితా పీఠంలో..** పాతనగరంలోని లలితా పీఠంలో శివరాత్రి వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉదయం 6 గంటలకు గోపూజ, లలితా సుందరేశ్వర స్వామివార్లకు పంచామృతాభిషేకం, బిల్వార్చన, మహా మంగళహారతి, ప్రసాద వితరణ, అనంతరం భజన కార్యక్రమాలు ఉంటాయని లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి తెలిపారు. సాయంత్రం 6 గంటలకు లలితా సుందరేశ్వర స్వామి వార్ల కల్యాణం, సాయంత్రం 7 గంటలకు 108 కలశములతో లలితా సుందరేశ్వర స్వామి వార్లకు అభిషేకం, నందికోళ్ల సేవ ఏర్పాటు చేశారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో 3 కోట్ల, 12 లక్షల వత్తులతో ఆకాశ శివ మహాజ్యోతి వెలిగించనున్నారు.

● నగరంలోని వివిధ శైవ క్షేత్రాల్లో శివరాత్రి సందర్భంగా బిల్వార్చనలు, కుంకుమార్చనలు, రుద్రాభిషేకాలు, స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మహాశివరాత్రికి బుగ్గ రామేశ్వరాలయం ముస్తాబు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. బుధవారం నుంచి మార్చి 2వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించామని ఈవో మద్దిలేటి తెలి పారు. టీటీడీ బోర్డు సభ్యుడు, నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రభ బండి ఎంతగానో భక్తులను ఆకర్షించనుంది. కాల్వ గ్రామంలో బుగ్గ రామేశ్వరస్వామికి ఈవో మద్దిలేటి, ఆలయ ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మలు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి ఉత్సవ మూర్తులను గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవ మూర్తులను కాల్వ గ్రామం నుంచి బుధవారం ఉదయం 10 గంటలకు కాల్వబుగ్గకు చేరుకోనున్నాయి. ఉత్సవ కమిటీ సభ్యులు కాటినేని నారా యణ, కాకి దేవేంద్ర, రామాంజనేయ శర్మ, పెద్ద మల్లయ్య, మాతృనాయక్ పాల్గొన్నారు.



విద్యుద్దీపాల అలంకరణలో జగన్నాథ గట్టులోని రూపాల సంగమేశ్వర ఆలయం, (ఇన్‌సెట్)లో స్వామి వారు

● **భారీ బందోబస్తు:** శివరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం నుంచి మార్చి 2వ తేదీ వరకు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు తెలిపారు. మంగళవారం కాల్వబుగ్గ దేవస్థానంలో మహాశివరాత్రి ఏర్పాట్లను వారితో పాటు టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ పరిశీలించారు. కోనేరు, క్యూలైన్ల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. బందోబస్తులో ఒక సీఐ, ముగ్గురు ఎస్ఐలు, ఐదుగురు ఏఎస్ఐలు , హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు మొత్తం 50 మందిని నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ కుమార్ పాల్గొన్నారు.



కాల్వబుగ్గలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మల్లెల రాజశేఖర్, డీఎస్పీ

సమస్యలు పరిష్కరించాలి: ఎస్టీయూ

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నప్పటికీ ఉద్యోగులు, పెన్షనర్లు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి చొరవ చూపకపోవడంతో శోచనీయమన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు, పెన్షనర్లకు సంబంధించిన 12వ పీఆర్సీ నియామకం చేయకపోవడం, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించకపోవడం, డీఏ మంజూరు చేయకపోవడం, సీఆర్ సీడీఏ బకాయిలు చెల్లించకపోవడం, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నామన్నారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధి పని చేయాలని, లేని పక్షంలో ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తుందని హెచ్చరించారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టీకే జనార్దన్, గోవిందు, శేఖర్, గోవింద నాయక్, సురేష్, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి

జీవోను విడుదల చేయాలి

గడ్డి తింటూ హమాలీల నిరసన



గడ్డి తింటూ నిరసన వ్యక్తం చేస్తున్న హమాలీలు

గూడూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లై హమాలీల కూలి రేట్ల జీవోను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం గూడూరులోని ఎంఎల్ఎస్ పాయింట్ దగ్గర హమాలీలు గడ్డి తింటూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, రాజశేఖర్, నాగేష్, మధు, దానమన్న, మద్దిలేటి, రంగన్న, రామాంజనేయులు, కొమ్ము రాజు, సురేష్ పాల్గొన్నారు.

గ్యాస్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా రమేష్‌గౌడు

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్యాస్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా రమేష్‌గౌడును ఎన్నుకున్నారు. మంగళవారం ప్రైవేటు హోటల్‌లో గ్యాస్ ఏజెన్సీ డీలర్ల సమావేశాన్ని నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున రెడ్డి, ఉపాధ్యక్షులుగా కళ్యాణ్, గోపాల్, వెంకటేశ్వరరెడ్డి, జాయింట్ సెక్రటరీ అమర్నాథ్, ట్రెజరీ సావిత్రి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రజాదరణ గల నాయకుడు జగన్ : వైసీపీ

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాదరణ కలిగిన నాయకుడని వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరుసుభాష్ చంద్రబోసు అన్నారు. మంగళవారం వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫల మైందన్నారు.

ఇష్టంతో చదవాలి: ఎంఈవో

సి.బెళగల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఎంఈవో ఆదాం బాషా అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన సి.బెళగల్‌లోని ఎస్సీ హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు.

దళితులను ఆదుకోవాలి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రోజా వీధిలో తుంగభద్ర నది ఒడ్డున వేస్తున్న రోడ్డుతో దళితులు తీవ్రంగా నష్టపోతారని, వారిని ఆదుకోవాలని రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత అన్నారు. మంగళవారం నగర పాలక కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణకు వినతిపత్రం అందజేశారు.

ఎట్టకేలకు ఎల్‌టీలకు అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్లు

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో 2024-25 బ్యాచ్‌కు చెందిన ల్యాబ్ టెక్నీషియన్లకు సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్లు అందజేశారు. సోమవారం అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్ కోసం ప్రదక్షిణలు అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన సూపరింటెండెంట్ ఎల్‌టీ కోర్సును పూర్తి చేసిన వారికి నెల రోజులుగా సర్టిఫికెట్లు ఎందుకు అందజేయలేదని అధికారులపై మండి పడ్డారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ మధ్యాహ్నం ఐదుగురికి అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్లు అందజేశారు.

షీబాక్స్‌లను ఏర్పాటు చేయాలి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏపీజేఏసీ అమరావతి నాయకులు

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో షీబాక్స్‌లను ఏర్పాటు చేయాలని ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం చైర్‌పర్సన్ సాయిరాభాను అన్నారు. మంగ ళవారం కలెక్టర్ కార్యాలయంలో ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం కలెక్టర్ రంజిత్ బాషాను కలిశారు. ఆమె వెంట ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ కేవై.కృష్ణ, ప్రధాన కార్యదర్శి లక్ష్మీరాజు, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి పద్మావతి, క్లాస్-4 ఉద్యో గుల సంఘం అధ్యక్షులు మద్దిలేటి ఉన్నారు.

తూనికలు, కొలతల శాఖ తనిఖీలు



దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని పాతబస్టాండు సమీపంలోని బంగారు నగర దుకాణాలపై తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేశారు. మంగళవారం అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాముడు ఆధ్వర్యంలో ఎస్‌కేఎస్ షాపింగ్ కాంప్లెక్స్, ఎస్‌కేఎస్ షరాఫ్ బజార్‌లోని బంగారు దుకాణాల్లో తనిఖీలు చేశారు. బిల్లులో గోల్డ్ ప్యూరిటీ, స్టోన్ వెయిట్ తెలుపకపోవడంతో 4 కేసులు నమోదు చేసి రూ.50వేల జరిమానా వసూలు చేశారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్లు పరమే శ్వరకుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ల పట్టివేత

కోడుమూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగిరి గ్రామంలో అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్ మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. గ్రామ పరిధిలోని రైతుల పొలాల నుంచి అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే వెంకటగిరి గ్రామానికి చేరుకొన్నారు. గ్రామానికి చెందిన నాగరాజు, గిడ్డయ్య, రాజు, లక్ష్మన్నలకు చెందిన ట్రాక్టర్లు, అలాగే శ్రీనివాసులుకు చెందిన ఎక్స్‌కవేటర్‌ను పట్టుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని పట్టుబడిన వాహనాలను మైనింగ్ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ తబ్రేజ్ మాట్లాడుతూ అనుమతి లేకుండా అక్రమంగా ఎర్రమట్టి, ఇసుక తరలిస్తే సహించేది లేదన్నారు.

అది హర్యానా గ్యాంగ్ పనే..

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్నటేకూరు సమీపంలో జరిగిన ఏటీఎం మిషన్ చోరీ కేసులో పోలీ సులు కేసు దర్యాప్తు ముమ్మరం చేశారు. డీఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ కుమార్, ఉలింద కొండ ఎస్ఐ ధనుంజయలతో బృందాన్ని నియమించారు. టోయింగ్ వాహనాన్ని చోరీ చేసినప్పటి నుంచి ఏటీఎం మిషన్ వదిలేసే వరకు ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. సెల్ టవర్ డంప్‌ను విశ్లేషిస్తున్నారు. కొన్ని నెంబర్లను అనుమానాస్పదంగా గుర్తించారు. ఈ నెంబర్ల ఆధారంగా వీరంతా హర్యానా గ్యాంగ్ చెందిన వారుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఓ బృందం ఈ గ్యాంగ్ బెంగ ళూరు సమీపంలో ఉన్నట్టు గుర్తించి అక్కడికి వెళ్లినట్లు తెలిసింది.

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం

గవర్నర్ ప్రసంగానికి ఎమ్మెల్సీ బీటీ నాయుడు ధన్యవాదాలు



ప్రసంగిస్తున్న బీటీ నాయుడు

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం అని ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. మంగళ వారం శాసన మండలిలో గవర్నర్ ప్రసంగానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తెచ్చి భూములపై రైతులకు హక్కులేకుండా చేసే ప్రయత్నం చేశారని, రీసర్వే పేరుతో రైతుల భూములను దోచేశారని మండి పడ్డారు. రైతులు, వ్యాపారులు, యువత, విద్యార్థులు అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేసి రాష్ట్ర సంపదను దోచుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో అమరావతి, పోలవరం నిర్మాణాలతో రాష్ట్రాన్ని సస్యశా మలం చేసే దిశగా సీఎం చంద్రబాబు, నారా లోకేష్, పవన్ కల్యాణ్ చేస్తున్న కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి 6.50లక్షల కోట్ల పెట్టుబ డులు తెచ్చారని, మరిన్ని పెట్టుబడులు తెచ్చి ఉపాధి, ఉద్యోగ అవకాశాల తోపాటు సంపద సృష్టించ బోతున్నారని తెలిపారు.

గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలి



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ అన్నారు. మంగళశారం స్థానిక డీఎస్ఏ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఫెన్సింగ్ క్రీడా పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, న్యాయవాది శ్రీధర్ రెడ్డి, ఫెన్సింగ్ క్రీడా శిక్షకుడు మహేశ్వరరావు, మహేష్, మణికంఠ పాల్గొన్నారు.

28లోపు ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలి

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పింఛన్‌దారులు ఈ నెల 28లోపు జీవన్ ప్రమాణ ధ్రువీకరణ పత్రాలు ఖజానా కార్యాలయంలో గానీ, జీవన్ ప్రమాణ ప్రభుత్వ యాప్ ద్వారా గానీ తప్పనిసరిగా సమర్పించాలని జిల్లా ఖజానా అధికారి రామచంద్ర రావు తెలిపారు. జిల్లాలో 18,707 పింఛన్‌దారులకు గాను 15,701 మంది జీవన్ ప్రమాణ్ ధ్రువీకరణ పత్రాలు సమర్పించారన్నారు. కదలలేని పింఛన్‌దారులు వివరాలు తెలియజేస్తే ఖజానా సిబ్బంది ద్వారా పింఛన్‌దారు ఇంటి వద్దనే జీవన్ ప్రమాణ్ ధ్రువీకరణ పత్రాన్ని ప్రభుత్వ యాప్ ద్వారా అందిస్తామని తెలిపారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి: ఏడీఏ

సి.బెళగల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలపై సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ సంచాలకుడు సాలురెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం బ్రాహ్మణదొడ్డిలో వ్యవసాయ అసిస్టెంట్ చెంచు రాజు అధ్యక్షతన రైతులతో సమావేశం నిర్వహించారు. ఏవోలు మల్లేష్‌కుమార్, శోభరాణి, ఎంపీఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించొద్దు

గూడూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించొద్దని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మోహన్ కోరారు. గూడూరులో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తలాపా కార్యాలయం ముందు సీఎం చంద్రబాబుకు లేఖలను పంపారు. సీఐటీయూ నాయకుడు దానమన్న, మున్సిపల్ పారిశుధ్య కార్మిక సంఘం నాయకుడు శాంతన్న, మనోహరమ్మ, గుంతన్న, గ్రేసమ్మ, పాల్గొన్నారు.

దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): బీసీ, ఓసీ, కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులు, బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 730 మంది దరఖాస్తు చేసుకోగా, 460 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కార్యక్రమంలో హుశేనాపురం, ఓర్వకల్లు, నన్నూరు బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో మంగళవారం బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు కెనరా, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుల మేనేజర్లు, ఎంపీడీవో రాణెమ్మ ఇంటర్వ్యూలు నిర్వహించారు.

కాల్వబుగ్గలో అగ్ని ప్రమాదం

ఓర్వకల్లు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా ఆలయం ఎదురుగా గాలిగోపురం వద్ద షామియానాలు వేశారు. అయితే మంగళవారం రాత్రి 10:30 గంటలకు ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో షామియానాలు కాలిపోయాయి.

వెనక్కి తీసుకెళ్లండి..

- గత నెలలో కందులను కొన్న మార్క్‌ఫెడ్ అధికారులు
- నేడు నాణ్యంగా లేవని, రైతులే ఆలూరుకు వెళ్లి తెచ్చుకోవాలని హుకుం


నిల్వ ఉన్న కందులు

కందులను కొనుగోలు చేసిన అనంతరం అవి బాగలేవని వెనక్కి తీసుకెళ్లాలని సూచించడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

మద్దికెర, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దికెర, బురుజుల, పెరవలి, హంపా గ్రామాల్లో మార్క్‌ఫెడ్ వారు కందులను కొనుగోలు చేశారు. క్వింటం రూ.7,750ల ప్రకారం పెరవలిలో 1,500, హంపాలో 350, బురుజులలో 350, మద్దికెరలో 1000 క్వింటాళ్లను కొనుగోలు చేశారు. మార్క్‌ఫెడ్ వారు క్వాలిటీ కంట్రోల్ అధికా రులతో కందులను ఒకటి రెండుసార్లు పరిశీలించి అనంతరమే కొనుగోలు చేశారు.

వెనక్కు పంపిన గోదాము అధికారులు

రైతుల వద్ద కొనుగోలు చేసిన ఈ కందులను ఆలూరు గోదాములకు పంపారు. అయితే అక్కడ వీటిని పరిశీలించిన అధికారులు మద్దికెర మండలం నుంచి 140 క్వింటాళ్లు బాగా లేవని వెనక్కి తీసుకెళ్లాలని సూచించారు. ఒక్కొక్క రైతుకు 5, 10, 20, 29 క్వింటాళ్లు మొత్తం 9మంది రైతులకు చెందిన కందులు బాగాలేవని తిరిగి తీసుకెళ్లాలని సమాచారం ఇచ్చారు.

రైతులకు రవాణా ఖర్చులు

ఆలూరు నుంచి తిరిగి కందులను తీసుకు రావాలంటే రవాణా ఖర్చులు భరించాలంటే తలకు మించిన భారమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులే కందులను తెచ్చివ్వాలని కోరుతున్నారు.

- ఈ విషయంపై మార్క్‌ఫెడ్ కొనుగోలు అధికారి రామకృష్ణ మాట్లాడుతూ దాదాపు 2వేల క్వింటాళ్లు పంపామని, కొన్ని క్వింటాళ్లు మాత్రమే వెనక్కు వచ్చాయనీ, ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులే ఆలూరుకు వెళ్లి తెచ్చుకోవాలని తామేం చేయలేమని వివరణ ఇచ్చారు.

రవాణా చార్జీలు ఎవరిస్తారు?



కందులను మార్క్‌ఫెడ్ వారికి విక్రయించాం. అయితే వాటిలో 29 ప్యాకెట్లు నాణ్యంగా లేవంటున్నారు. ఆలూరుకు వెళ్లి తెచ్చుకోవాలంటే రవాణ చార్జీలు ఎవరు ఇస్తారు. **- వెంకటేశ్వరరెడ్డి**

రీసర్వే వేగవంతం చేయాలి

మద్దికెర, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామంలో రీసర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ హుశేన్‌సాహెబ్ కోరారు. మంగళవారం రీసర్వేను పరిశీలించారు. 8 బృందాలు రీసర్వే చేస్తున్నాయని, ఒక్కో బృందం 20ఎకరాలు మాత్రమే చేయాలన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.

సారా స్థావరాలపై దాడి

తుగ్గలి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలలోని బాటతాండ, పరిసర ప్రాంతాల్లో మంగళవారం సారా స్థావరాలపై దాడులు చేసి బెల్లం ఊట, నాటు సారా ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు తెలిపారు. గ్రామస్థులతో మాట్లాడుతూ నింది తులపై పీడీ యాక్టు బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కృష్ణమ్మ

ఆదోని, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ రంజిత్ బాషను టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ కోరారు. ఈమేరకు మంగళవారం కర్నూలులో కలెక్టర్‌ను కలిసినట్లు తెలిపారు. రహదారులను వెడల్పు చేయాలని, గ్రామాల్లో తాగునీటి సమస్య తలెతకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు కలెక్టర్‌ను సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు.

రైతుల అప్పులన్నీ రద్దు చేయాలి

- రైతు సంఘం గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఉన్న అప్పులన్నీ రద్దు చేయాలని రైతు సంఘం గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీఆర్ భవన్‌లో రైతు సంఘం నాయకుల సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి రాజాసాహెబ్ అధ్యక్షతన నిర్వహించారు. వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులు ఏటా అతివృష్టి, అనావృష్టితో పంటలను నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకుంటామన్న ప్రభుత్వాలు ప్రకటనలకే పరిమితమయ్యాయన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంపన్నగౌడ్, కౌలుదారుల సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య పాల్గొన్నారు.

వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలి

ఆలూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంట్‌లో చట్టబద్ధతకు కూటమి ప్రభుత్వం కృషి చేయాలని వీఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు డిమాండ్ చేశారు. మంగళవారం వాసవి కల్యాణ మండపంలో విలేకరులతో మాట్లాడుతూ మార్చి 3న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వాల్మీకులకు మంత్రిగా అవకాశం ఇవ్వాలన్నారు. తాలూకా అధ్యక్షుడు కృష్ణ, మండల అధ్యక్షులు వరుణ్, నాయకులు అరికెర వెంకటేష్, వీరేష్, నాగేంద్ర, శివ, ఆంజనెయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీలోనే అక్షరానికి పునాది


మాట్లాడుతున్న ట్రైనర్ ఫక్కీరప్ప

మద్దికెర, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చిన్నారుల్లో అక్షరానికి పునాదులు వేయాలని ఎంఈవో-2 గోపాల్, ట్రైనర్లు ఫక్కీరప్ప, లీలావతి సూచించారు. మంగళవారం జడ్పీ బాలుర పాఠశాలలో జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులు ముగిశాయి. చిన్నారులకు అర్థమయ్యేలా ఆటపాటలతో చదువు చెప్పాలని, మంచి అలవాట్లు నేర్పించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి, లక్ష్మినారాయణ ఉన్నారు.

వైసీపీ కుంభకోణంపై విచారణ చేయాలి

- అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే పార్థసారథి



ఆదోని, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అవినీతి భూకుంభకోణాలపై విచారణ జరిపించాలని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి డిమాండ్ చేశారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడారు. జగనన్న కాలనీకి 65 మంది రైతుల నుంచి బలవంతంగా భూమిని సేకరించారని ఆరోపించారు. అప్పటి ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి అనుచరులతో రైతులను బెదిరించి ప్రభుత్వ ధర కంటే తక్కువగా కొనుగోలు చేశారన్నారు. ప్రభుత్వం రూ. 25కోట్లు మంజూరు చేస్తే ఇందులో రూ. 15కోట్లకు పైగా వైసీపీ వాళ్ళ ఖాతాలో జమయ్యాయని ఆరోపించారు.

విద్యాభివృద్ధికి కృషి చేస్తాం


పాఠశాలకు కంప్యూటర్లు అందిస్తున్న సిబ్బంది

తుగ్గలి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి కృషి చేస్తామని జియో మైసూరు కంపెనీ డైరెక్టర్ మానసరంజన్ బిశ్వాల్, మేనేజర్ రామ్మోహన్ సోమిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పగిడిరాయి ప్రాథమిక పాఠశాలకు 135 డెస్కులు, కంప్యూటర్లు, ఇన్వర్టర్, క్రీడాసామగ్రితో పాటు సీసీ కెమెరాలు అందించారు. కంపెనీ చుట్టూ ఉన్న జొన్నగిరి, పగిడిరాయి, బొందలవానిపల్లె గ్రామాల్లో విద్య ఆరోగ్యం, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. హెచ్‌ఎం రవీంద్ర, తల్లిదండ్రులు కోరిన విధంగా సదుపాయాలు కల్పించామన్నారు. సిబ్బంది పెద్దిరెడ్డి, రమేష్, రంగస్వామి తదితరులు ఉన్నారు.

జీవనోపాధుల పెంపునకు కృషి



మాట్లాడుతున్న వాటర్‌షెడ్ అధికారులు

హాలహర్వి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ఆధారిత కుటుంబాల జీవనోపాధుల పెంపునకు వాటర్ షెడ్ పథకం కీలకమని ప్రాజెక్టు ఎస్‌వో వలిబేగ్ అన్నారు. మంగళవారం సర్పంచ్ మల్లికార్జున అధ్యక్షతన వాటర్ షెడ్ యాత్ర నిర్వహించారు. భూమి అభివృద్ధి, చెక్ డ్యాంలు, డ్రిప్ ఇరిగేషన్, పవర్ స్ప్రేయర్స్, ట్రాక్టర్లు పనిముట్లు వంటి యంత్రాలు రాయితీతో ఇస్తామన్నారు. సిబ్బంది గోవిందప్ప, రమేష్, తెదెపా నాయకులు శ్రీధర్, మారుతి పాల్గొన్నారు.

శివలింగాలతో శాంతి యాత్ర


శివలింగాలతో ర్యాలీ నిర్వహిస్తున్న బ్రహ్మకుమారీలు

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో శివలింగాలతో శాంతియాత్ర నిర్వహించారు. డిగ్రీ కళాశాల సమీపంలోని ఈశ్వరీయ విద్యాలయం వద్ద నుంచి శాంతియాత్రను మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ ప్రారంభించారు. నిర్మల, రాధ, పుష్ప, లక్ష్మీ, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పోస్టుమార్టం ఆలస్యంపై బాధితుల ఆగ్రహం

- మృతదేహం అప్పజెప్పాలని ఆసుపత్రి ముందు బంధువుల ఆందోళన


మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ ఎదుట విలపిస్తున్న బంధువులు

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆస్పరి మండలం మొత్తుకూరు గ్రామంలో నెట్టే కంటయ్య (33) అనే వ్యక్తి రెండు రోజు క్రితం అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఆస్పరి పోలీసులు మృతదేహాన్ని ఆదోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అయితే మృతదేహం కుళ్ళిపోయి ఉండడం, చీకటి పడటంతో పోస్టుమార్టం చేయడానికి ఆలస్యమైంది. మంగళవారం ఉదయం వైద్యుడు అనిల్ వచ్చి కుళ్ళిపోయిన మృతదేహానికి పోస్టుమార్టం చేయలేమని కర్నూలుకు తీసుకెళ్లాలని తెలియజేశారు. దీంతో బంధువులు గ్రామస్థులు ఆసుపత్రి వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ దేవిశెట్టి ప్రకాష్ ఆసుపత్రి వద్దకు చేరుకొని చేసుకొని వైద్యులతో మాట్లాడంతో పోస్టుమార్టం చేయించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పజెప్పడంతో బంధువులు శాంతించారు.

రుణాల కోసం ఇంటర్వ్యూలు

- అధిక సంఖ్యలో హాజరైన మహిళలు


ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీలు, ఈ-బీసీలకు సబ్సిడీ రుణాల మంజూరు కోసం మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పెద్ద సంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యారు. మహిళలు అధిక సంఖ్యలో ఉండడం విశేషం. పట్టణ పరిధిలో 98 యూనిట్లు ఉండగా, 2,600 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకొన్నారు. ఒకటో వార్డు నుంచి 20వ వార్డు వరకు దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులను బ్యాంక్లు మొదటి విడతగా మంగళవారం ఇంటర్వ్యూలను నిర్వహించారు. తరిగి గురువారం 21వ వార్డు నుంచి 42వ వార్డువరకు దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

సీపీఐ వందేళ్ల వేడుకలు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ఆస్పరి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిల్లేకల గ్రామంలో సీపీఐ వందేళ్ల వేడుకలు నిర్వహించారు. జిల్లా కార్యదర్శి గిడ్డయ్య మాట్లాడుతూ, భూమి, భుక్తి, పేదల విముక్తి కోసం సీపీఐ పోరాటాలు చేసిందన్నారు. 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన సీపీఐ, బ్రిటీష్‌కు వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం పోరాడిందన్నారు. వేదవతి నిర్మాణానికి బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని, చెరువులను హంద్రీనీవా నీటితో నింపాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య, సీపీఐ సహాయ కార్యదర్శి కృష్ణమూర్తి, మండల నాయకులు బ్రహ్మయ్య, ఊరుకుందప్ప, హనుమంతు, దస్తగిరి, శ్రీనివాసులు, శివన్న, హమాలి సంఘం అధ్యక్షుడు చంద్ర, ఏఐవైఎఫ్ నాయకులు బాబు, రమేష్, వెంకటేష్, నల్లన్న, రంగప్ప పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి


ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ వినియోగదారుల నుంచి అదనంగా వసూలు చేస్తున్న గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్డీవో భరత్ నాయక్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఒక్కో సిలిండర్‌పై రూ.50 నుంచి 60లు అదనంగా వసూలు చేస్తున్నారన్నారు. వినియోగదారులు గోవర్దన్, రాజు, వెంకటేశ్, ఆచారి, రాహుల్ పాల్గొన్నారు.

మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

హొళగుంద, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్లమాడికి పంచాయతీ ముద్దటామాగి గ్రామానికి చెందిన మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ గాదిలింగ (36) గుండె పోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. మంగళవారం ఉదయం చాతిలో తీవ్ర నొప్పి రావడంతో అస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మృతుడికి భార్య విశాలాక్షి, నలుగురు పిల్లలు ఉన్నారు. తెలిపారు. కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వీఆర్ఏ కుటుంబాన్ని ఆదుకోవాలి

మద్దికెర, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అవుకు మండలం ఉప్పలపాడు గ్రామ వీఆర్ఏ తలారీ రాముడు కుటుంబానిన ఆదుకోవాలని వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు సుంకన్న, కార్యదర్శి దామోదర్ డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ హుశేన్‌సాహెబ్‌కు వినతి పత్రం అందజేశారు. వీఆర్ఏ రాముడు రీసర్వే వెళ్తుతూ మరణించాడని ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని కోరారు. వీఆర్ఏలు సురేంద్ర, ఈరన్న, విజయలక్ష్మి, మస్తాన్, పులికొండ, బాషా, ఆనంద్ ఉన్నారు.

4న జోడు రథోత్సవం

హాలహర్వి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూళ్యం గాదిలింగేశ్వర స్వామి జోడు రథోత్సవాన్ని 4న నిర్వహిస్తున్నట్లు ఈవో రాధాకృష్ణ తెలిపారు. దర్శనం సులభంగా అయ్యే విధంగా చూస్తామని భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వేసవి రాక ముందే..

- 15 రోజులకు ఒకసారి నీటి సరఫరా
- పట్టించుకోని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు


తోపుడు బండిపై బిందెలతో వెళ్తున్న మహిళ

హొళగుంద, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరణికి, నేరణికి తండాల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. పంచాయతీ అధికారులు 15 రోజులకోసారి నీరు సరఫరా చేస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోర్లు పనిచేయకపోవడంతో ఇందిగా ఉందని, పొలాల్లోని బోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నాంటున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్సై దిలీప్ కుమార్

ఆలూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై దిలీప్ కుమార్ సూచించారు. మంగళవారం రాఘవేంద్ర డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ బాధితులు 1930 సైబర్ టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేదవతికి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

ఆలూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేదవతి ప్రాజెక్టు నిర్మాణానికి రూ.వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని సీపీఐ కార్యవర్గ సభ్యుడు మద్దిలేటి శెట్టి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కార్యదర్శి రామాంజినేయులు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ గోవింద్ సింగ్‌కు వినతి పత్రం అందించారు. ఎత్తిపోతల పథకాన్ని 8.5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించి 80 వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్నారు. పాలకులు మారుతున్నా ఈ ప్రాజెక్టు మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు సాగడం లేదన్నారు. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. రైతు సంఘం కార్యదర్శి సిద్దలింగ, పెద్దహోత్తూరు గ్రామ కార్యదర్శి రాముడు, సుభాని, ఉల్లిగప్ప, రామాంజి, మల్లి, రాముడు పాల్గొన్నారు.

ముస్తాబైన ఆలయాలు


సట్టా బజార్‌లోని శంభు లింగేశ్వర స్వామి ఆలయం

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నేడు శివరాత్రి పురస్కరించుకొని ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరిం చారు. ప్రభాకర్ థియేటర్ పక్కన ఉన్న సట్టా బజార్‌లోని శంభు లింగేశ్వర స్వామి, కుమ్మరి గేరి ఈశ్వరి ఆలయం, అంబే ద్కర్ నగర్ పురాతనమైన శంకర ఆలయం, కోటా కాలనీలోని చంద్రమౌళీ శ్వర స్వామి ఆలయం, శాంత మల్లప్ప కొండపై వెలసిన శాంత మల్లేశ్వర ఆలయం, కోట రామలింగేశ్వర స్వామి దేవాలయాలను అందంగా ముస్తాబు చేశారు.

ముగిసిన శిక్షణ

ఆలూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బాల్య సంరక్షణ విద్యపై 6 రోజులుగా జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ వర్కర్స్‌కు నిర్వహించిన శిక్షణ మంగళవారం ముగిసింది. ఐసీడీఎస్ సీడీపీవో శశికళ, ఎంఈవోలు కోమల దేవి, చిరంజీవి రెడ్డి మాట్లాడుతూ చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్య అందించి పాఠశాలలకు సంసిద్ధం చేయాలని సూచించారు. బోధనా సామర్థ్యం పెంచుకునేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆరు రోజులు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పద్మావతి, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆలూరు సీడీపీవో శశికళ

గుర్తింపు సంఖ్యతో రైతులకు సేవలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఏవో అశోక్ కుమార్ రెడ్డి



ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో భూమి ఉన్నత రైతులకు సేవలు సులభతరంగా అందు తాయని ఆదోని వ్యవసాయ అధికారి అశోక్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

ప్రశ్న: ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యతో రైతుకు ఉపయోగం ఏంటి?

జవాబు: విత్తనాలు, ఎరువులు రాయితీతో అందించేందుకు, 11 వ్యవసాయ సంబంధిత సేవలు ఈ సంఖ్యద్వారా అందుతాయి.

ప్రశ్న: గుర్తింపు సంఖ్య ఎక్కడ చేస్తారు?

జవాబు: గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలి.

ప్రశ్న: ఏ ఏ ప్రతాలు తీసుకెళ్లాలి?

జవాబు: భూమికి సంబంధించిన రికార్డ్ లేదా వన్ బీ, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ ఇవ్వాలి.

ప్రశ్న: రబీ పంటలకు ఈ క్రాప్ నమోదును ఎప్పటిలోగా చేయాలి?

జవాబు: రబీ పంటలకు ఈనెల 25వ తేదీ లోపు తప్పకుండా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి.

ప్రశ్న: పీఎం కిసాన్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చా?

జవాబు: 2019 ఫిబ్రవరికి ముందే పొలం రిజిస్ట్రేషన్ చేసుకొని ఉంటే పీఎం కిసాన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి: సబ్‌కలెక్టర్



సిరాలదొడ్డిలో రీ సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యా భరద్వాజ్ ఆదేశించారు. మంగళవారం కడిమెట్ల మజరా గ్రామమైన సిరాలదొడ్డి గ్రామం లో జరుగుతున్న రీ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కడిమెట్ల గ్రామంలో మొత్తం ఎంత భూ విస్తీర్ణం ఉంది, ప్రధాన సమస్యలు ఏమైనా ఉన్నాయా అని తహసీల్దార్ శేషఫణిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట మండల సర్వేయర్ వాహిద్, ఆర్ఎస్ డీటీ జ్యోతిర్మయి, సర్వేయర్ సురేష్, రైతులు పాల్గొన్నారు.

అభ్యంతరం లేని ఇంటి స్థలాలకు పట్టాలు ఇస్తాం

మంత్రాలయం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూమిలో ఇంటి స్థలాలకు పట్టాలు ఇస్తామని మంత్రాలయం తహసీల్దార్ ఎస్.రవి, డిప్యూటీ తహసీల్దార్ గురురాజరావు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ గత నెల 29న ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల మేరకు 2019 అక్టోబరు 15 నుంచి ప్రభుత్వ భూమిని, అభ్యంతరం లేని భూమిని మూడు సెంట్లు (150 గజాలు)ని ఉచితంగా పట్టాలుగా అందజేస్తామన్నారు. 150 గజాలు పైన ఉన్న భూములకు నిర్ణీత పైకం చెల్లించి పట్టా పొందవచ్చని తెలిపారు. 2024 మార్చి 15లోపు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న వారి ఆధారాలు పరిశీలించి అర్హులైన వారికి ఇంటి పట్టాలు మంజూరు చేస్తామని తెలిపారు.

అత్యవసర సేవలపై విద్యార్థులకు అవగాహన

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): సమాజంలో అందుతున్న అత్యవసర సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని సిరాలదొడ్డి గ్రామంలో ప్రధానోపాధ్యాయురాలు కళావతి, ఉపాధ్యాయుడు భాస్కర్ విద్యార్థులకు పరిసరాల విజ్ఞానంలో పాఠ్యాంశం ప్రమాదాలు, ప్రథమ చికిత్స బోధనలో భాగంగా ప్రమాదాలు, భద్రతా చర్యలు, అత్యవసర సేవలపై అవగాహన కల్పించారు. అత్యవసర సేవల్లో పోలీసు సేవలైన 100, ప్రమాద సమయంలో అత్యవసర సమయంలో 108, వైద్య సలహాలకు మొబైల్ క్లీనిక్ అయిన 104 వంటివి అందుబాటులో ఉన్నాయని తెలిపారు

అధికారుల నిర్లక్ష్యం తగదు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఇటుకల బట్టీల యాజమాన్యంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం సరికాదని ఏఐటీయూసీ తాలుకా కార్యదర్శి తిమ్మగురుడు, నరసింహారెడ్డి, పట్టణ కార్యదర్శి విజయేంద్ర పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఇటుకల బట్టీల యాజమాన్యంపై స్థానిక తహసీల్దార్ శేషఫణి ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. నిర్లక్ష్యం వహిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు వీరేష్, నరసింహులు, వీరాంజనేయులు, శివ పాల్గొన్నారు.



నదిలోకి మురుగు..

● కలుషితమవుతున్న తుంగభద్ర నది

● రోగాల బారిన ప్రజలు ● పట్టించుకోని అధికారులు

మంత్రాలయం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలోని మురుగునీరంతా తుంగభద్ర నదిలో కలుస్తోంది. దీంతో నీరు కలుషితమవుతోంది. సంత మార్కెట్, ఓల్డ్‌టౌన్‌లోని మురుగునీరంతా కాలువ ద్వారా తుంబభద్ర నదిలోకి చేరుతోంది. నదిలో మురుగునీరు కలుస్తుండటంతో ఆ నీటిని తాగి రోగాల బారిన పడుతున్నామని నది పక్క ఉన్న గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నదిలో మురుగునీరు కలవకుండా చర్యలు చేపట్టాలని అనేక సార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మంత్రాలయంలో దేశంలోనే ప్రముఖ ఆలయం. ఈ ఆలయానికి దేశ నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. నదిలో మురుగునీరును చూసి ఆశ్చర్యానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి నదిలో మురుగునీరు కలవకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు, భక్తులు కోరుతున్నారు.



నిల్వ ఉన్న మురుగునీరు



చర్యలు తీసుకుంటాం

మురుగునీరు నదిలో కలవడం వాస్తవమేనని, ఆ నీరు కలవకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. గ్రామంలోని అధిక శాతం గ్రామానికి దూరంగా మురుగునీటిని పంపింగ్ చేస్తున్నామని, కొంత భాగం నదిలో కలుస్తుందని, ఆ భాగం కూడా నదిలో కలవకుండా చర్యలు చేపడుతాం.

- తెల్లబండ్ల భీమయ్య, సర్పంచ్, మంత్రాలయం



అండర్ డ్రైనేజీ వ్యవస్థ రూపొందిస్తున్నారు

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, ఇది పూర్తయితే గ్రామంలోని కొంత భాగం మురుగునీరు నదిలో కలవకుండా సంపు ఏర్పాటు చేస్తున్నాం. సంపు పనులు పూర్తయితే తుంగభద్ర నదిలో మురుగునీరు కలవకుండా ఉంటుంది.

- నాగరాజు, పంచాయతీ కార్యదర్శి, మంత్రాలయం

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు

మంత్రాలయం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మార్చి ఒకటి నుంచి ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్ష ప్రశ్నపత్రాలు మంగళవారం మంత్రాలయం చేరుకున్నాయి. రూట్ ఆఫీసర్ గుప్త పరీక్షల చీఫ్ రమేష్, డిపార్టుమెంట్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి ప్రశ్నపత్రాలు స్వాధీనం చేసుకుని మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. మూడు సెట్ల ప్రశ్నపత్రాలు రావడంతో సీఐ రామాంజుల ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. లెక్చరర్లు రామకృష్ణ, రాఘవేంద్రరావు, మద్దిలేటి, ప్రభాకర్ ఉన్నారు.

బోధనాభ్యాసాన్ని మెరుగు పరుచుకోవాలి

గోనెగండ్ల, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): బోధనాభ్యాసాన్ని ప్రతి అంగన్‌వాడీ టీచర్లు మెరుగు పరుచుకోవాలని ఎంపీడీవో మణి మంజరి అన్నారు. మంగళవారం మోడల్ స్కూల్ నందు మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణా ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం ఆరు రోజులపాటు శిక్షణా కార్యక్రమాన్ని మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేకంగా జిల్లా సమగ్ర శిక్షణ అడిషనల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో రామాంజినేయులు, నీలకంఠ, ప్రిన్సిపాల్ షహనా పర్వీన్, పుల్లన్న, నారాయణ రావు, డీఆర్పీలు పాల్గొన్నారు.

నేడు దీపోత్సవం

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలోని మార్కండేయ స్వామి దేవాలయంలో బుధవారం దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైసీపీ నాయకులు రుద్రగౌడ్, మాజీ ఎంపీ బుట్టా రేణుక, జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పద్మశాలి సంఘం నాయకుడు విశ్వనాథ్ రమేష్ మాట్లాడుతూ శివరాత్రి రోజు దీపాలు వెలిగించాలని కోరారు.

బ్యాంకు కార్యాలయాన్ని తరలించొద్దు



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడపలోనే ఉండాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ముందు ధర్నా చేపట్టారు. సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు మాట్లాడుతూ 2006 సంవత్సరంలో ఏర్పడ్డ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు కడపలో సొంత భవనాలు కలిగి ఉన్న ఏపీజీబీ బ్యాంకును హుటా హుటిన అమరావతికి తరలించడం సరైనది కాదన్నారు. కార్యక్రమంలో సిబ్బంది గిరిబాబు,సురక్షకుమార్, చందు, రామన్న పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని సీపీఎం నాయకులు తిక్కన్న, పరమేష్, చిరంజీవి, ఈరన్న డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రమైన పెద్దకడుబూరులోని ఏపీజీపీ గ్రామీణ బ్యాంకులో బ్యాంకు ఉద్యోగికి సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఖాతాదారులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి

పెద్దకడుబూరు , ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని ఏవో వరప్రసాద్ అన్నారు. మంగళవారం బసలదొడ్డి గ్రామంలో పోలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో పురుగుల మందుల, రసాయనిక ఎరువుల వినియోగం అధికం కావటం వల్లన ప్రజలు ఆనారోగ్య బారిన పడుతున్నారన్నారు. ఈ విషయాలను గమనించిన బసలదొడ్డి గ్రామ రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపడం శుభపరిణామమన్నారు. పురుగుల మందులు వాడకుండా పండించిన వ్యవసాయ ఉత్పత్తులను ప్రతి సోమవారం మండల కేంద్రంలో ప్రదర్శించేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో నాన్‌పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ మాస్టర్ ట్రైనర్ అనీల్‌కుమార్, వ్యవసాయ సహాయకులు శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

టీబీ మహమ్మారిని తరిమికొడదాం

పెద్దకడుబూరు , ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): టీబీ అనే మహమ్మారిని తరిమికొడదాం అని డీఎల్ఎటీవో భాస్కర్, జిల్లా కోఆర్డినేటర్ సుధాకర్ నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని దొడ్డిమేకల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముక్త్ పంచాయతీ కార్యక్రమం నిర్వహించారు. ఎవరైనా దగ్గు తగ్గకుండా ఉంటే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి టీబీ పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వం 6 నెలల వరకు ఉచితంగా మందులను పంపిణీ చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సుస్మిత, రవిచంద్రకుమార్, ఎస్‌టీఎల్ఎస్ స్వరూప్‌కుమార్, గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్, గ్రామ పెద్దలు వేంకటేశ్వర్ రెడ్డి, శివరామిరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్వ్యూలు

కౌతాళం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ కింద సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంగళవారం కౌతాళం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సుబ్బరాజు, బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలానికి ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ కింద 51 యూనిట్లను మంజూరు చేయగా 530 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికి మంగళవారం ఉదయం ఇంటర్వ్యూలను ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించారు. అర్హులైన వారికి బ్యాంకుల ద్వార రుణాలు అందజేస్తామని బ్యాంకు అధికారులు తెలిపారు.

27న ఎంపీడీవో కార్యాలయంలో..

మంత్రాలయం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బీసీ, కాపు, ఓసీలకు 73 యూనిట్లకు 27న మంత్రాలయం ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శోభారాణి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మంత్రాలయం మండలంలో ఉన్న ఆరు బ్యాంకులకు 382 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. బీసీలకు 60 యూనిట్లు, కాపు 6 యూనిట్లు, ఓసీలకు 7 యూనిట్లకు కలిపి రూ.1.47 కోట్లు రుణాలు అందించేందుకు ఆయా బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు చేసి అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. రాయితీ రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరూ తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో 27న హాజరు కావాలని కోరారు.

ఉక్కు సంకల్పంతో స్వర్ణాంధ్ర దిశగా పయనం

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు , ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ విధ్వంస పాలన, కష్టాలను ఎదుర్కొంటూ ఉక్కు సంకల్పంతో స్వర్ణాంధ్ర 2047 సుభిక్ష భవిష్యత్తు కోసం సీఎం నారా చంద్రబాబునాయుడు విజన్‌ను ఇవ్వడం జరిగిందని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో ఆయన ప్రసంగించారు. సుస్థిరమైన అత్యంత నివాసయోగ్యమైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వంలో సీఎం నారా చంద్రబాబునాయుడు ముందుకు సాగుతున్నారన్నారు. 1990లో తన తండ్రి బీవీ మోహన్‌రెడ్డి మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో సీఎం చంద్రబాబునాయు డు హైదరాబాద్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేసి ప్రపంచ పటంలో నిలిపి అందరు హైదరాబాద్‌వైపు చూసేలా చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిన అన్ని రంగాలను సరిదిద్దుతు ముందుకు పోవడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని గవర్నర్ ప్రసంగంలో స్పష్టంగా చెప్పడం జరిగిందన్నారు. రాష్ట్రంలో మిరప రైతులు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రంతో మాట్లాడి రూ.11వేలకు పైగా కొనుగోలు చేసేలా చేశారన్నారు. దాన్ని కూడా రాజకీయం చేసే విధంగా మాట్లాడుతున్నారన్నారు. కేవలం వైసీపీ వాళ్లు తమ ఉనికిని కాపాడుకునేందుకు మాట్లాడే ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. సహచర శాసన సభ్యులు కూనా రవికుమార్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నానన్నారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బీవీ

శివరాత్రికి ఆలయాలు ముస్తాబు

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రికి ఎమ్మిగనూరు పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో వెలసిన శివాలయాలు, ఆంజనేయస్వామి, సాయిబాబా దేవాలయాలను ఆలయ అర్చకులు ముస్తాబు చేశారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న సాయిబాబు దేవాలయం, వీవర్స్ కాలనీలోని ఆంజనేయస్వామి దేవాలయం, తేరు బజారు ప్రాంతంలోని నీలకంఠేశ్వరస్వామి, అన్నమయ్య సర్కిల్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. అలాగే ఆయా దేవాలయాల్లో రాత్రి జాగాకరణ చేసేందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో దేవతామూర్తులను అలంకరించారు. స్వామివారి కల్యాణానికి ఆలయ అర్చకులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

మంత్రాలయం: నియోజకవర్గంలోని మంత్రాలయం, మాధవరం, రాంపురం, వగరూరు తదితర గ్రామాల్లో శివాలయాలు ముస్తాబయ్యాయి. బుధవారం స్వామివారికి రుద్రాభిషేకం, మహా మంగళహారతి ఉంటాయమని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాటు చేశారు.



ఎమ్మిగనూరులో విద్యుద్దీపాలంకరణలో ఆంజనేయస్వామి ఆలయం

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై విహారించారు. మంగళవారం మాఘ మాసం ద్వాదశి శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారు జామునుంచే బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణబోధ పూజ మందిరంలో మూలరాములకు, జయరాములు, దిగ్విజయరాములకు కనకాభిషేకం చేశారు. స్వర్ణ రథం పై ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు మఠం పీఠాధిపతి భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.



స్వర్ణ రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

పన్నులు సకాలంలో చెల్లించాలి

ఎమ్మిగనూరు టౌన్,ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పాటు అందించాలని మునిసిపల్ కమిషనర్ గంగిరెడ్డి కోరారు.మంగళవారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ ప్రజలు ఆస్తి పన్ను,నీటి పన్ను, ఖాళీ స్థలం పన్ను, ట్రెడ్ లైసెన్స్ పన్నులు, ప్రకటనల పన్నులు అన్ని కూడా సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధిలో భాగం కావాలన్నారు. మార్చి నెలాఖరులోగా పన్నులు చెల్లించాలని, సంవత్సరం పన్ను ఎవరైతే ముందుగా చెల్లిస్తారో వారికి 5శాతం డిస్కౌంట్ ఇస్తామని అన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పెద్దకడుబూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ, వీధిదీపాల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నాయకులు వీరేష్, వీరాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. బీసీ కార్పొరేషన్ రుణాలను అర్హులైన వారికి మాత్రమే అందజేయాలన్నారు. మండలానికి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని కోరారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. తిక్కన్న, హనుమంతు, గిడ్డయ్య, నరసింహులు, నాగేంద్ర పాల్గొన్నారు.

మిరప రైతులను ఆదుకోవాలి

కలెక్టర్‌కు టీడీపీ నాయకుల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో తుంగభద్ర నది, ఎల్లెల్సీ, బోరుబావుల కింద, టీబీపీ కెనాల్ కింద సాగు చేసుకుంటున్న మిరప రైతులను ఆదుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, టీబీపీ ఎల్లెల్సీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ టిప్పుసుల్తాన్, తెలుగు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి చంద్రకాంత్, రాష్ట్ర నాయకులు అడివప్పగౌడు కలెక్టర్‌ను కోరారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ రంజిత్‌బాషాను కలిసి వినతి పత్రం అందజేశారు. రైతులు వాతావరణం మార్పుల కారణం వల్ల 90 శాతం తెల్లకాయలు రావడం, నల్లతామర, పురుగు అధికం కావడంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదన్నారు. మిరప రైతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట బీమా వర్తించేలా ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటపతిరాజు ఉన్నారు.

రోడ్డును నిర్మించాలి

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ నుంచి కోసిగి రోడ్డులో ఉన్న కంబళదిన్నె మారెమ్మ దేవాలయం వరకు ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డును వేయాలని ఆటో యూనియన్ కార్మికులు మల్లకల్లు, వీరేష్, సుధాకర్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ఎంతో మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గర్భిణులు ఆటోలు, బస్సులు, ద్విచక్ర వాహనంలో వచ్చే సమయంలో రక్తస్రావాలు జరిగి ఇబ్బందిపడుతున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి రోడ్డును వేయాలన్నారు. కార్యక్రమంలో ఈరన్న, సోమేష్, అక్బర్, నాగన్న, గోపాల్, విరుపాక్షి పాల్గొన్నారు.